ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వైసీపీ నేతల కబంధ హస్తాల్లో ఉత్తరాంధ్ర భూములు


సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

వైవీ సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి వంటి నాయకుల గుప్పిట్లో వేలాది ఎకరాలు

- మూడు కబ్జాలు, ఆరు సెటిల్‌మెంట్లు అన్నట్టుగా ఉంది వైసీపీ పాలన
- చెత్తపై పన్ను వేసిన ఈ ప్రభుత్వాన్ని కూడా చెత్తలో కలిపేద్దాం
- ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు భూదందాలు
- కోట్లు ఆర్జించాడే తప్ప అభివృద్ధి శూన్యం
- పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కరెప్షన్ కింగ్
- జగన్ రాష్ట్ర స్థాయిలో దోచేస్తే... అతను పెందుర్తిలో దోచేస్తున్నాడు

అచ్యుతాపురం/పెందుర్తి, మే 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో భూములను వైసీపీ నాయకులు వైవీ సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి దోచేశారని, వేలాది ఎకరాలు వారి కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బుధవారం సాయంత్రం అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నియోజకవర్గ పరిధిలోని అచ్యుతాపురం, రాత్రి విశాఖ జిల్లా పెందుర్తి జంక్షన్‌లో జరిగిన సభలో ప్రసంగించారు. వైసీపీ ప్రభుత్వ పాలన మూడు కబ్జాలు, ఆరు సెటిల్‌మెంట్లు అన్న చందంగా సాగుతోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా వైసీపీ నాయకులు తమ భూములు దోచేశారన్న మాటే వినిపిస్తోందన్నారు. వైసీపీ నేతలు ఎక్కడికక్కడే భూములు ఆక్రమించుకుంటున్నారని ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు.

కన్నబాబు రాజు కాదు.. కన్నాల రాజు

అచ్యుతాపురం: ప్రస్తుత ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు కాదని.. కన్నాల రాజని జనసేన ... మిగతా 6వ పేజీలో



అచ్యుతాపురం సభకు హాజరైన అశేష ప్రజానీకం


అచ్యుతాపురం సభలో కమలం గుర్తు చూపుతున్న సీఎం రమేశ్, గాజు గ్లాసు గుర్తు చూపుతున్న సుందరపు విజయ్‌కుమార్

జన ప్రభంజనం

- జనసేన అధినేత పవన్ కల్యాణ్ కోసం తరలివచ్చిన అశేష ప్రజానీకం

అచ్యుతాపురం, మే 1: అచ్యుతాపురం జనసంద్రమైంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారం కోసం బుధవారం మధ్యాహ్నం ఇక్కడికి రావడంతో జనం పోటెత్తారు. మధ్యాహ్నం మూడు గంటలకు వారాహి యాత్ర ఉంటుందని తెలిసి అచ్యుతాపురం- పూడిమడక రోడ్డులో సభాస్థలికి వేలాది మంది తరలివచ్చారు. పవన్ కల్యాణ్ హెలికాప్టర్‌లో బ్రాండిక్స్ ఆవరణలో దిగారు. నాలుగు గంటలకు అశేష ప్రజానీకం కూటమి జెండాలతో కేరింతలు కొట్టారు. సభా ప్రాంగణం చాలకపోవడంతో మూడు, నాలుగు అంతస్థుల భవనాలపైకి ఎక్కి పవన్ కల్యాణ్ రాక కోసం ... మిగతా 6వ పేజీలో

స్థానిక సమస్యల ఊసెత్తని జగన్

నియోజకవర్గానికి వరాల మాటే లేదు

- కేవలం ప్రతిపక్ష నేత చంద్రబాబుపై విమర్శలతో సరి
- నిరాశపరిచిన ముఖ్యమంత్రి ప్రసంగం
- మండుటెండలో జనం విలవిల
- సభ ప్రారంభంకాగానే తిరుగుముఖం
- ట్రాఫిక్ ఆంక్షలతో ప్రజలకు తప్పని ఇబ్బందులు



సీఎం జగన్ సభ జరుగుతుండగా బయటకు వెళ్లిపోతున్న జనం (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న సీఎం జగన్

పాయకరావుపేట, మే 1:

'స్థానిక సమస్యల ప్రస్తావన లేదు. నియోజకవర్గానికి వరాల ఊసేలేదు. తమ హయాంలో ఏం చేశామో చెప్పలేదు. కేవలం ప్రతిపక్ష నేత చంద్రబాబుపై అక్కసు వెళ్లగక్కడం తప్ప కొత్తగా చెప్పిందేమీ లేదు'.. ఇదీ పాయకరావుపేట సూర్యామహల్ జంక్షన్‌లో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రసంగం తీరు. మండుటెండలో జనాన్ని నిలబెట్టి మూస ప్రసంగం చేయడంతో అందరూ విసిగిపోయారు.

గత ఎన్నికల సమయంలో ఇదే చోటు నుంచి వైఎస్ జగన్ ప్రసంగించారు. ఎన్నో హామీలు ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చాక నెరవేర్చలేదు. ఇప్పుడు కూడా సూర్యామహల్ జంక్షన్‌లో బుధవారం మధ్యాహ్నం 2.18 గంటలకు సీఎం జగన్ ప్రసంగం ప్రారంభించారు. మండుటెండలో సుదీర్ఘ ప్రసంగం చేశారు. స్థానిక సమస్యలు ప్రస్తావించకపోవడంతో జనం నిరాశ చెందారు. సీఎం సభ కోసం పార్టీ నాయకులు వ్యాన్లు, ఆటోల్లో ఉదయాన్నే జనాన్ని తరలించగా, జగన్ ప్రసంగం ప్రారంభంకాగానే చాలా మంది వెనుదిరిగి వెళ్లిపోయారు.

ట్రాఫిక్ ఆంక్షలతో ఇబ్బందులు

సీఎం సభ కోసం పోలీసులు విధించిన ట్రాఫిక్ ఆంక్షలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జగన్ ఎన్నికల సభ మధ్యాహ్నం జరగనుండగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పట్టణంలోకి వాహనాలు రాకుండా నాలుగువైపులా దారులు మూసివేశారు. తుని వైపు నుంచి వచ్చే వాహనాలు చిత్రమందిర్ సెంటర్‌లో బారికేట్లు ఏర్పాటుచేసి తాండవ జంక్షన్ నుంచి పట్టణంలోకి రాకుండా ఎల్‌టీ కాలనీ ప్రారంభంలో ఒకచోట, మంగవరంరోడ్డు శివారులోని అరట్లకోట సమీపంలో మరో చోట బారికేట్లు ఏర్పాటుచేసి గ్రామాల నుంచి పట్టణంలోని వాహనాలు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో జనం ఇబ్బందులు పడ్డారు. వై జంక్షన్ వద్ద పట్టణంలోకి వాహనాలు రాకుండా బారికేట్లు ఏర్పాటుచేసిన పోలీసులు జగన్ సభకు ఆటోలు, ఇతర వాహనాల్లో వచ్చినవారిని మాత్రమే అనుమతించారు.

విశాఖకు సినీ హీరో బాలకృష్ణ

- నేటి నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రచారం


బాలకృష్ణకు స్వాగతం పలుకుతున్న శ్రీభరత్, తదితరులు

విశాఖపట్నం, మే 1: ప్రముఖ నటుడు, హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ బుధవారం నగరానికి వచ్చారు. ఆయనకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 2.30 గంటలకు విశాఖ చేరుకున్న బాలకృష్ణకు టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి, ఆయన అల్లుడు ఎం.శ్రీభరత్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో విశాఖ వెళ్లారు. బాలకృష్ణ గురువారం నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎన్నికల ప్రచారం చేయనున్నారు. శుక్ర లేదా శనివారాల్లో విశాఖలో రోడ్‌షో నిర్వహించనున్నట్టు సమాచారం.

సాగునీటి వనరులపై అంతులేని నిర్లక్ష్యం

పాయకరావుపేట, మే 1:

మండలంలో ఐదేళ్లుగా సాగునీటి వనరులు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. పలు పంట కాలువలపై ఉన్న డివిజన్ డ్యామ్‌లు శిథిలావస్థకు చేరుకుని గేట్లు లేక ఆయకట్టు భూములకు సక్రమంగా సాగునీరు అందడం లేదు. ఇక ఆయకట్టు శివారు భూములకు సాగునీరు అందే పరిస్థితి లేదు. దీంతో రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు.

శిథిలావస్థకు చేరిన డివిజన్ డ్యామ్‌లు

- గేట్లు లేక సాగునీరు వృథా
- ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపినా పట్టించుకోని వైనం
- ఐదేళ్లుగా రైతులకు తప్పని కష్టాలు


శ్రీరాంపురం వద్ద శిథిల స్థితిలో ఉన్న డివిజన్ గేట్లు


భూమి ఆనకట్ట వద్ద ధ్వంసమైన రాతిపేర్పు

ప్రతి ఏటా వర్షాకాలంలో పాయకరావుపేట వద్ద తాండవ నదిలోకి పలు కొండ గెడ్డలు, ఎగువ ప్రాంతంలోని పంట కాలువల ద్వారా వచ్చే నీటితో పాటు తాండవ రిజర్వాయర్ నుంచి నదిలోకి విడిచిపెడుతున్న నీరు పాయకరావుపేట వద్ద భూమి, ముఠా ఆనకట్టల వరకు చేరుతుండగా, మండలంలోని వేల ఎకరాల పంట భూములకు సాగునీరందుతోంది. దీనిలో ముఠా ఆనకట్టకు కుడి వైపు ఉన్న ముఠా చానెల్ పరిధిలో 5,280 ఎకరాల ఆయకట్టు భూములుండగా, ఆనకట్ట ఎడమవైపు ఉన్న మంగవరం చానెల్ పరిధిలో 1,256 ఎకరాల భూమిని రైతులు సాగు చేస్తున్నారు. భూమి ఆనకట్ట వద్ద ఉన్న భూమి చానెల్ పరిధిలో 2,549 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆదే విధంగా ఆవ చానెల్ పరిధిలో 2,464 ఎకరాలు, ఎం.ఎస్.పేట చానెల్ పరిధిలో 663 ఎకరాలు, రాజవరం చానెల్ పరిధిలో 363 ఎకరాలు, పాల్తేరు కనుముల చానెల్ పరిధిలో 223 ఎకరాలను రైతులు సాగు చేస్తున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

మండలంలో ముఠా చానెల్ పరిధిలో శిథిలావస్థకు చేరుకున్న డివిజన్ డ్యామ్‌లు 14, భూమి చానెల్ పరిధిలో 18, మంగవరం చానెల్ పరిధిలో 12 కలిపి.. మొత్తం 44 డివిజన్ డ్యామ్‌లు, గేట్లు పునర్నిర్మాణం, పాయకరావుపేట వద్ద భూమి, ముఠా ఆనకట్టల నిర్వహణ, గేట్ల మరమ్మతుల కోసం గత ఐదేళ్లుగా జలవనరుల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరుకాలేదు. మండలంలో సాగునీటి చెరువులు, పంట కాలువల్లో తుప్పలు, పూడిక పేరుకుపోయి సాగునీరు సక్రమంగా పారడం లేదు. దీనికి తోడు డివిజన్ డ్యామ్‌లకు గేట్లు లేకపోవడంతో అధిక మొత్తంలో నీరు వృథా అవుతూ అవసరమైన సమయాల్లో పంటలకు సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి వృథాను అరికట్టేందుకు రైతులు ఇసుక బస్తాలు, కొబ్బరి మట్టలు, బరకాలు అడ్డుగా వేసుకోవాల్సి వస్తోంది. శివారు భూములకు సాగునీరందే పరిస్థితి లేక వర్షాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మండలంలోని పలు పంట కాలువల్లో పూడిక, తుప్పలు తొలగించి దెబ్బతిన్న డివిజన్ డ్యామ్‌లను పునరుద్ధరించాలని, గేట్లకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. దీనిపై జలవనరుల శాఖ మండల ఏఈ శ్రీరామూర్తి వివరణ కోరగా గత ఐదేళ్లుగా మండలంలో సాగునీటి వనరుల మరమ్మతులకు నిధులు మంజూరుకాక పనులు జరగలేదని తెలిపారు. మండలంలో భూమి, ముఠా చానెళ్ల పరిధిలోని పంట కాలువల అభివృద్ధి, డివిజన్ డ్యామ్‌లు, గేట్ల మరమ్మతులు, భూమి, ముఠా ఆనకట్టల నిర్వహణకు రూ.14.5 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎన్నికలు ముగిసిన తరువాత నిధులు విడుదలైతే పనులు చేపడతామని ఆయన తెలిపారు.


అనకాపల్లిలో సీఐటీయూ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఘనంగా మేడే వేడుక

జిల్లాలో కార్మిక దినోత్సవం మేడే బుధవారం ఘనంగా జరిగింది. పలు కార్మిక సంఘాల కార్యాలయాలు, సంస్థలు, పరిశ్రమల వద్ద కార్మికులు జెండా ఆవిష్కరణ చేశారు. కార్మికుల ఐక్యత వర్థిల్లాలని నినాదాలు చేశారు.

భానుడి భగభగలు

అనకాపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. అత్యధికంగా బుధవారం చీడికాడ, దేవరాపల్లిలో 44.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రావికమతంలో 44.3, కోటవురట్లలో 43.1, బుచ్చెయ్యపేటలో 42.5, రోలుగుంటలో 42.4, కశింకోట, మాకవరపాలెంలో 42.1, చోడవరం, మాడుగులలో 41.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాగల 24 గంటల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరిస్తున్నారు.

బుచ్చెయ్యపేటలో దారుణ హత్య

పండగ రోజు ఇరువురి మధ్య ఘర్షణ

- కక్ష పెంచుకుని నడిరోడ్డుపై కత్తితో దాడి
- సంఘటనా స్థలంలోనే వ్యక్తి మృతి
- పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు


మృతుడు అచ్చెంనాయుడు (ఫైల్ ఫొటో)

బుచ్చెయ్యపేట, మే 1: బుచ్చెయ్యపేటలో బుధవారం ఉదయం ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. నడిరోడ్డుపై ఈ సంఘటన జరగడంతో స్థానికంగా కలకలం రేగింది. దీనికి సంబంధించి ఎస్‌ఐ ఈశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. బుచ్చెయ్యపేటకు చెందిన తాటికొండ అచ్చెంనాయుడు(39), గన్నెడ్డి శ్రీను మంగళవారం కందిపూడిలో అమ్మవారి పండగకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ సమయంలో ఇద్దరి మధ్య చోటుచేసుకున్న స్వల్ప వివాదం ఘర్షణకు దారి తీసింది. స్థానికులు ఇద్దరినీ విడదీసి సర్ది చెప్పి పంపించేశారు. అయితే కక్ష పెంచుకున్న శ్రీను బుధవారం ఉదయం 5.30 గంటల సమయంలో గోనె సంచిలో కత్తి పెట్టుకుని బుచ్చెయ్యపేట ప్రధాన రహదారిపై అచ్చెంనాయుడు కోసం మాటువేశాడు. అటుగా బైక్‌పై వెళుతున్న అచ్చెంనాయుడుపై శ్రీను కత్తితో దాడి చేశాడు. అచ్చెంనాయుడు బైక్ వదిలి పారిపోవడానికి ప్రయత్నించి కింద పడిపోయాడు. దీంతో అతని మెడ, దవడపై కత్తితో శ్రీను విచక్షణారహితంగా నరికేశాడు. సంఘటన స్థలంలోనే అచ్చెం నాయుడు మృతి చెందాడు. నిందితుడు శ్రీను పోలీస్ స్టేషన్‌కి వెళ్లి లొంగిపోయాడు. అచ్చెం నాయుడు కుటుంబ సభ్యులు, బంధువులు పోలీస్ స్టేషన్‌కి చేరుకుని నిందితుడు శ్రీనును తమకు అప్పగించాలని ఆందోళనకు దిగారు. కొత్తకోట సీఐ అప్పలనాయుడు వారికి సర్దిచెప్పి పంపించేశారు. మృతుని కుమారుడు పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఈశ్వరరావు తెలిపారు.

నిలిచిపోయిన బావమరిది నిశ్చితార్థం


అచ్చెంనాయుడు హత్యకు గురికావడంతో అతని బావమరిది నిశ్చితార్థం నిలిచిపోయింది. అచ్చెంనాయుడు అత్తవారి గ్రామం కందిపూడి. అక్కడ బుధవారం తన బావమరిది నిశ్చితార్థం కావడంతో భార్య దుర్గా భవాని, ముగ్గురు పిల్లలు కందిపూడిలోనే ఉన్నారు. హత్య విషయం తెలిసి బుచ్చెయ్యపేట వచ్చేశారు.

పవన్ కల్యాణ్‌కు నీరా'జనం'



అచ్యుతాపురంలో పవన్‌ను చూసేందుకు వచ్చిన అశేష జనం

జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం, విశాఖ జిల్లా పెందుర్తిలలో పర్యటన బుధవారం విజయవంతమైంది. అడుగడుగునా ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పవన్ సైతం ఉత్సాహంగా అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఆయా స్థానాల్లో పోటీ చేస్తున్న అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, ఎమ్మెల్యే అభ్యర్థులు సుందరపు విజయ్‌కుమార్, పంచకర్ల రమేష్ బాబులను ప్రజలకు పరిచయం చేస్తూ.. కూటమి అభ్యర్థులకు అఖండ విజయాన్ని చేకూర్చాలని అభ్యర్థించారు. ఇక పవన్ ప్రసంగాన్ని ఆద్యంతం ప్రజలు ఆసక్తికరంగా విన్నారు. - అనకాపల్లి



జనసేన గుర్తు గ్లాస్ కటౌట్‌తో పవన్‌కల్యాణ్



ప్రచార రథంపై ప్రసంగిస్తున్న సీఎం రమేష్, సుందరపు విజయ్‌కుమార్



రోడ్డు షోలో మహిళల కోలాటం



పవన్ ఫొటోను చూపుతున్న వీరాభిమాని



అచ్యుతాపురంలోకి పవన్ ప్రవేశిస్తుండడంతో అభిమానుల కేరింత



అచ్యుతాపురంలో పవన్‌కల్యాణ్ రోడ్‌షో



పెందుర్తి సభలో ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, పెందుర్తి అసెంబ్లీ అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబులను సభకు పరిచయం చేస్తున్న పవన్‌కల్యాణ్

6న తాళ్లపాలెంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన

» ఏర్పాట్లపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్‌సింగ్

కొత్తూరు, మే 1: ఈనెల 6వ తేదీన అనకాపల్లి నియోజకవర్గంలోని కశింకోట మండలం తాళ్లపాలెంలో జరగనున్న ప్రధాని నరేంద్రమోదీ పర్యటనపై ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు, నాయకులతో ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ పాల్గొని, పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో 80 శాతం కాపులు పవన్ వైపే

» బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్
» పవన్ వెనక్కి తగ్గి, త్యాగం చేశారు
» మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు
» నక్కపల్లిలో కాపుల ఆత్మీయ సమావేశం



కాపుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్


నక్కపల్లి, మే 1: వైసీపీ ఐదేళ్ల పాలనలో కాపులకు తీరని అన్యాయం జరిగిందని, ఆంధ్రప్రదేశ్‌లో తాను మూడు సర్వేలు చేయిస్తే 80 శాతం కాపులు పవన్ కల్యాణ్ వైపే వున్నారని తేలిందని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం టీడీపీ అభ్యర్థిని అనిత నివాసం వద్ద జరిగిన పాయకరావుపేట నియోజకవర్గ కాపుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. కాపుల్లో చీలిక వుందని వైసీపీ నాయకులు భ్రమలు పడుతున్నారని, ఆ భ్రమలన్నీ జూన్ 4న తొలగిపోతాయన్నారు. మెగాస్టార్ చిరంజీవి, జనసేననేత పవన్ కల్యాణ్‌లను జగన్ సహా వైసీపీ నేతలు ఎంతో అవమానించారని, వారందరికీ సరైన సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. కాపు విద్యార్థులకు ఈబీసీ సర్టిఫికెట్లు, రిజర్వేషన్ వంటి సమస్యలను తాను గెలిచాక కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

పవన్ వెనక్కి తగ్గి, ఎంతో త్యాగం చేశారు : గంటా

ఐదేళ్ల జగన్ పాలనలో వ్యవస్థలన్నీ రెడ్ల చేతిలో నలిగిపోతున్నాయని, ఎన్‌డీఏ కూటమికి శ్రీకారం చుట్టిన ఘనత జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కే దక్కుతుందని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పవన్ ఎక్కడ నెగ్గాలో కాదు.. ఎక్కడ తగ్గాలో అనే మాటను నిజం చేసి, ఎంతో త్యాగం చేశారని చెప్పారు. చిరంజీవి, పవన్‌లను ఎంతో అవమానించారని, అందుకు జూన్ 4న కాపులంతా బదులు తీర్చుకునే అవకాశం వచ్చిందన్నారు. నియోజకవర్గంలో కాపుల కోసం కల్యాణ మండపాల నిర్మాణానికి సీఎం రమేశ్ చర్యలు తీసుకుంటారని చెప్పారు. టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే స్థాయి వున్న కాపు నాయకులు ఎంతో మంది వున్నారని, అయితే రిజర్వేషన్ కారణంగా తమ లాంటి వారిని గెలిపిస్తున్న ఘనత వారికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి కాపు నాయకులు గెడ్డం బుజ్జి, తోట నగేశ్, కొప్పిశెట్టి వెంకటేశ్ మాట్లాడుతూ కాపులకు వైసీపీ పాలనలో చాలా అన్యాయం జరిగిందని ఆవేదన వెలిబుచ్చారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, కూటమి కాపు నాయకులు జానకి శ్రీను, పెదిరెడ్డి చిట్టిబాబు, అమలకంటి అబద్ధం, కొప్పిశెట్టి బుజ్జి, తుంపాల నాగేశ్వరరావు, కోసూరి శ్రీను, నానాజీ, పెదిరెడ్డి శ్రీను, పద్దు తదితరులు పాల్గొన్నారు.

మైహోమ్‌లో ఘనంగా శ్రీనివాస కల్యాణం

» హాజరైన త్రిదండి చినజీయర్ స్వామి



మైహోమ్ ఆవరణలో శ్రీనివాస కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న త్రిదండి చినజీయర్ స్వామి

ఎలమంచిలి, మే 1: ములకలాపల్లి మై హోమ్ సిమెంటు పరిశ్రమ ఆవరణలో వ్యూహ లక్ష్మీసమేత శ్రీనివాస స్వామివారి పుష్కర బ్రహ్మోత్సవంలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగశాలలో నిత్యారాధనం, చతుస్థానార్చన, మూలమంత్ర హవన పారాయణాదులు జరిపారు. అనంతరం సుందర సుమరిమళ వేదికపై భూదేవి సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం అనంతరం తీర్థ ప్రసాదగోష్ఠి, అన్నసమారాధనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస స్వామి వారి గరుడ వాహన సేవ నిర్వహించారు. మైహోమ్ గ్రూపు అధినేత జూపల్లి రామేశ్వరరావు, కుమారి దంపతుల చేతులమీదుగా త్రిదండి చినజీయర్ స్వామి వారి మంగళాశాసనాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్(వర్క్స్) వీహెచ్.చౌదరి, సిమెంట్ పరిశ్రమ అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు



టీడీపీలో చేరిన వారితో నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు

రాంబిల్లి, మే 1: మండలంలోని జడ్.చింతువా పంచాయతీ లోవపాలెం వైసీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం టీడీపీలో చేరారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్, పార్టీ నాయకులు ఎరిపల్లి చిట్టిబాబుల ఆధ్వర్యంలో అచ్యుతాపురం టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు చోడిపల్లి రాంబాబు, బంగారు చిట్టి, దేముడు, ఎరిపల్లి సత్యం, చోడిపల్లి రాము, గౌరి, ఎరిపల్లి మహేష్, చెల్లూరి చంటి, సత్తిబాబు, చట్టిబాబు, మేరుగు దేముడు తదితరులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల్లో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు గాజుగ్లాస్ గుర్తుపైన, బీజేపీ ఎంపీ అభ్యర్థి ఎంపీ రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. నాయకులు చెల్లూరి ఆనంద్, నేతలు గనగళ్ళ కోదండరామ్, చెల్లూరి భూలోకరావు, చెల్లూరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'గోపాలమిత్రలపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం'



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ

నాతవరం, మే 1: వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో ఉన్న 2500 మంది గోపాలమిత్ర కుటుంబాలు కష్టాల్లో పడ్డాయని గోపాలమిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లాడ వెంకటరమణ అన్నారు. మండలంలోని తాండవ సెంటర్‌లో బుధవారం ఏర్పాటైన గోపాలమిత్ర సభ్యుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో రాష్ట్రంలో ఉన్న గోపాలమిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, నెలకు 16 వేల రూపాయలు వేతనం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. దాదాపు ఐదేళ్లు కావస్తున్నా తమ సమస్యలను పట్టించుకోలేదని వాపోయారు. 1999లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన నెలకు రూ. ఆరువేల వేతనమే ఇప్పటికీ గోపాలమిత్ర సభ్యులకు ఇస్తుండడం దారుణమన్నారు. అంతేకాకుండా జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గోపాలమిత్ర సభ్యుల సమస్యలను పట్టించుకోకుండా, మరోవైపు పశు సంవర్ధక సహాయకుల పోస్టులను ఏర్పాటు చేసి తమను మరింత నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర చేసేటప్పుడు తమ సమస్యలను మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ద్వారా అతని దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ఈ తరుణంలో టీడీపీ మ్యానిఫెస్టోలో గోపాలమిత్ర సమస్యలను పరిష్కరిస్తామని చేర్చడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సభ్యులు కోటి, ఎం.రామకృష్ణ, అనిమిరెడ్డి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

డుంబ్రిగుడలో వ్యక్తి హత్య

డుంబ్రిగుడ, మే 1: మండల కేంద్రంలోని నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవనంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించే ఓ వ్యక్తి బుధవారం హత్యకు గురయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు అరకు సీఐ రుద్రశేఖర్, ఎస్ఐ సంతోష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి ఎస్.కోట మండలంలోని రాజీపేట గ్రామానికి చెందిన బత్తిన శివ శ్రీనివాస్ (45)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు సీఐ చెప్పారు. హత్యకు గల కారణాలపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామని, నిందితులను పట్టుకుంటామని ఆయన తెలిపారు.

జెడ్.గంగవరంలో యువకుడి హత్య!

మాకవరపాలెం, మే 1: మండలంలోని జెడ్.గంగవరంలో ఓ యువకుడు హత్యకు గురైన సంఘటన బుధవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. గ్రామ శివావారు జీడి, మామిడి తోటల్లో పడి ఉన్న యువకుడి మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ రామకృష్ణారావు బృందం ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. అయితే మృతుడు ఎవరనేది తెలియరాలేదు. ఈ ఘటన ఎలా జరిగింది అన్న కోణంలో దర్యాప్తు సాగిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతదేహం ఉన్న ప్రదేశంలో చెప్పులు, మృతుడు వేసుకున్న ఫ్యాంట్ జేబులో బైకు తాళం తప్ప మరే ఇతర ఆధారాలు లభించలేదన్నారు. క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్ రంగంలోకి దిగాయి. ఇదిలావుంటే, మండలంలో ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతుండడంతో మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

కశింకోట, మే 1 : రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం బయ్యవరం రైల్వేస్టేషన్ యార్డు వద్ద జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి తుని రైల్వే పోలీసు స్టేషన్ ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన మారేడిపూడి కమల్ (20) గ్లాడిటర్ సెక్యూరిటీ ఏజెన్సీలో గార్డుగా పనిచేస్తున్నాడు. ఉదయం 6 గంటల సమయంలో రైల్వేట్రాక్ దాటుతుండగా విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న రైలు బండి ఢీకొంది. ఈ ప్రమాదంలో కమల్ అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతదేహానికి అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

భర్త హత్య కేసులో భార్య అరెస్టు

సబ్బవరం, మే 1: మండలంలోని గొటివాడ శివారు సాలాపువానిపాలెంలో గత నెల 26 రాత్రి దారుణ హత్యకు గురైన సాలాపు శ్రీనివాసరావు(33) భార్య అమరపిన్ని భాగ్యలక్ష్మిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. మృతుడు శ్రీనివాసరావు భార్య భాగ్యలక్ష్మికి అదే గ్రామానికి చెందిన గల్లా రవికుమార్‌తో వివాహేతర సంబంధం ఉందని తమ దర్యాప్తులో తేలిందన్నారు. ఆమె ప్రోద్బలంతోనే పథకం ప్రకారం గరికిపాటి శ్రీహరి అలియాస్ హరీష్ ఇద్దరూ కలసి శ్రీనివాసరావును హత్య చేశారన్నారు. ఈ నేపథ్యంలో మృతుడు భార్య భాగ్యలక్ష్మిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

రైతు మృతికి కారణమైన వ్యక్తికి ఆరు నెలలు జైలు

కొత్తూరు, మే 1: రైతు మృతికి కారణమైన వ్యక్తికి ఆరు నెలలు జైలు శిక్ష విధించినట్టు అనకాపల్లి రూరల్ సీఐ ఎస్. ధనుంజయరావు బుధవారం తెలిపారు. అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ముత్యా సన్యాసిరావు 2021 మే 31న తెల్లవారు జామున తన పంట పొలానికి వెళుతుండగా అడవి పందుల నివారణ నిమిత్తం అదే గ్రామానికి చెందిన కర్రి లచ్చన్న తన పంట పొలం చుట్టూ కరెంటు పెట్టారన్నారు. ఈ విషయం తెలియక ఎప్పటిలానే సన్యాసిరావు తన పొలానికి వెళుతుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడని భార్య నాగమణి అనకాపల్లి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. దీంతో అప్పటి సీఐ జి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ డి.ఈశ్వరరావు పూర్తి విచారణ చేసి, కేసు నమోదు చేశారని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి పదవ అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య వాదోపవాదాలు విన్న తరువాత రూ.3లక్షలు జరిమానా చెల్లించాలని లేకుంటే 6 నెలల పాటు జైలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చారన్నారు. నిందితుడు లచ్చన్న వద్ద అంత ఆర్థిక స్థోమత లేదని చెప్పడంతో 6 నెలలు జైలు శిక్ష అనుభవించేందుకు అంగీకరించాడన్నారు. ఈ మేరకు నిందితున్ని విశాఖ సెంట్రల్ జైలుకు తరలించామని సీఐ తెలిపారు. ఈ కేసుకు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వడ్డాది వెంకట్రావు వ్యవహరించారు.

పేపరు ప్లేట్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

ఎలమంచిలి, మే 1: పట్టణానికి సమీపంలోని పేపరు ప్లేట్ల తయారీ పరిశ్రమలో బుధవారం ఉదయం ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో పరిశ్రమలోని విలువైన మిషనరీతో పాటు సామగ్రి కాలిపోయాయి. ఈ అగ్ని ప్రమాదంలో రూ.15 నుంచి రూ.20 లక్షల నష్టం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగి ఉండవచ్చునని, సుమారు రూ.6 లక్షలు నష్టం జరిగి ఉండవచ్చునని అగ్నిమాపక అధికారి రాంబాబు తెలిపారు.

18 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

ముంచంగిపుట్టు, మే 1: మండల కేంద్రానికి సమీపంలో చెక్‌పోస్టు వద్ద బుధవారం 18 కిలోల గంజాయితో పాటు ఇద్దరు స్మగ్లర్లను పట్టుకున్నామని ఎస్ఐ కె.రవీంద్ర తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద రెవెన్యూ అధికారులు, పోలీసులు సంయుక్తంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. అదే సమయంలో ఒడిశా వైపు వెళ్తున్న బొలెరో వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా సుమారు 18 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. గంజాయితో పాటు ఇద్దరు గంజాయి స్మగ్లర్లను, ఒక బొలెరో వ్యాన్‌ను, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన ఇద్దరు గంజాయి స్మగ్లర్లు ఒడిశా రాష్ట్ర కోరాపుట్టు జిల్లా జయనగర్ గ్రామానికి చెందిన షేక్ రంజాన్, అదే జిల్లా పాత కోరాపుట్టుకు చెందిన ప్రకాష్ భోస్లాలుగా విచారణలో తేలిందన్నారు. వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డీటీ సీహెచ్.భూపతిరావు, పోలీసులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

పెదబయలు, మే 1: మండల కేంద్రంలో గత నెల 27న మేడపై పడుకున్న సోభ హేమరాజును కత్తితో దాడి చేసి హత్య చేసిన పుల్లల సుందర్‌రావును బుధవారం అరెస్టు చేసినట్టు జి.మాడుగుల సీఐ రమేశ్ తెలిపారు. వివాహేతర సంబంధం నెపంతో హత్య చేసి నిందితుడు పరారీలో ఉన్న విషయం తెలిసిందే. నిందితుడిపై హత్యా నేరం కింద కేసు నమోదు చేసిన పోలీసులు, గాలింపు చర్యలు చేపడుతుండగా మంగళవారం నిందితుడు లొంగిపోయాడు. దీంతో నిందితుడ్ని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ చెప్పారు.

'రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి'

అనకాపల్లి రూరల్, మే 1 : జిల్లాలో ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆధ్వర్యంలో ఎన్నికల పరిశీలకులు దల్జీత్‌సింగ్ మంగత్ బుధవారం నిర్వహించారు. గతంలో శంకరంలోని ఈవీఎం గొడౌన్‌లో మొదటి విడత ర్యాండ్ మైజేషన్ చేసి సీల్ చేశారు. బుధవారం రెండో విడత ఈవీఎంలను కంప్యూటర్ ద్వారా బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాక్‌లను అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో ర్యాండ్ మైజేషన్ చేశారు. బీయూలు, సీయూలు, వీవీప్యాట్‌లు 20 శాతం రిజర్వులో ఉంచడం జరుగుతుందని దల్జీత్‌సింగ్‌మంగత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు డాక్టర్ పి.రాకేష్‌కుమార్, డీఆర్‌ఓ దయానిధి, అనకాపల్లి ఎంపీ అభ్యర్థుల ఏజెంట్లు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

మన్యానికి మకుటం


- బ్రిటీష్ కాలంలోనే ప్రాచుర్యం
- అల్లూరి ఉద్యమానికి కేంద్రం
- 1962లో అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు
- 2004 వరకూ కొనసాగిన సెగ్మెంట్
- పునర్విభజనలో భాగంగా 2008లో 'పాడేరు'లో విలీనం

చరిత్ర పుటల్లోకి చింతపల్లి


చింతపల్లి ముఖ ద్వారం

1962-2004 మధ్యకాలంలో పదిసార్లు ఎన్నికలు

- కాంగ్రెస్ పార్టీ ఐదు పర్యాయాలు, టీడీపీ మూడుసార్లు, సీపీఐ రెండుసార్లు విజయం
- మరోమారు నియోజకవర్గంగా ఏర్పడుతుందని స్థానికుల ఆశాభావం


దేవూరి కొండలరావు

ఏజెన్సీలో చింతపల్లి ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉంది. బ్రిటీష్ వారి హయాంలో విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు చింతపల్లి కేంద్రంగానే తన ఉద్యమాన్ని నిర్మించారు. తొలి సాయుధ పోరాటంలో భాగంగా చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడిచేశారు. తుపాకులను ఎత్తుకెళ్లడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలమైంది. కాగా స్వాతంత్ర్యానంతరం 1953లో ఆంధ్ర రాష్ట్రం, 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన విషయం తెలిసింది. అప్పటికి చింతపల్లి కేంద్రంగా అసెంబ్లీ నియోజకవర్గం లేదు. 1961లో చేపట్టిన డీలిమిటేషన్ అనంతరం చింతపల్లి కేంద్రంగా 1962లో శాసనసభా నియోజకవర్గం ఏర్పాటైంది. దాదాపు 55 ఏళ్ల తరువాత 2007-08లో జరిగిన నియోజకవర్గాల పునర్విభ జనలో చింతపల్లిని రద్దు చేశారు. 2004లో జరిగిన ఎన్నికలే చివరివి. 2009 ఎన్నికల నుంచి చింతపల్లి ప్రాంతం పాడేరు నియోజకవర్గంలో కొనసాగు తున్నది. కాగా చింతపల్లి నియోజకవర్గంగా ఉండగా 1962 నుంచి 2004 వరకు మొత్తం పదిసార్లు ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా ఐదు పర్యాయాలు గెలుపొందింది. టీడీపీ మూడుసార్లు, సీపీఐ రెండుసార్లు విజయం సాధిం చాయి. టీడీపీ ఆవిర్భావం తరువాత ఈ స్థానానికి ఆరుసార్లు ఎన్నికలు జరగ్గా...కాంగ్రెస్ పార్టీ ఒక్కసారి మాత్రమే గెలుపొందడం గమనార్హం. 1994లో పొత్తులో భాగంగా టీడీపీ ఈ సీటును సీపీఐకి విడిచిపెట్టింది. లేకపోతే ఆ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేసి వుంటే కచ్చితంగా విజయం సాధించి వుండేదని ఆ పార్టీ సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

1962 నుంచి 2004 వరకు జరిగిన ఎన్నికల్లో చింతపల్లి నుంచి గెలుపొందిన అభ్యర్థులు, ఓడిన సమీప ప్రత్యర్థులు, ఇతర వివరాలు...

- తొలిసారి 1962లో జరిగిన ఎన్నికల్లో 11,807 ఓట్లు పోలయ్యాయి. లంబసింగి గ్రామానికి చెందిన దేపూరు కొండలరావు కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి, స్వతంత్ర పార్టీ అభ్యర్థి కిల్లు మల్లంనాయుడుపై 834 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- 1967లో జరిగిన ఎన్నికల్లో 32,141 ఓట్లు పోలవ్వగా కాంగ్రెస్ అభ్యర్థి దేపూరు కొండలరావు...స్వతంత్ర పార్టీ అభ్యర్థి పీబీ పడాల్‌పై 4,850 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- 1972 ఎన్నికల్లో 30,132 ఓట్లు పోలవ్వగా కాంగ్రెస్ అభ్యర్థి ఇంగువ రామన్నపడాల్, ఇండిపెండెంట్ అభ్యర్థి మత్స్యరాస మత్స్యరాజుపై 11,772 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- 1978లో జరిగిన ఎన్నికల్లో 47,997 ఓట్లు పోలవ్వగా కాంగ్రెస్ అభ్యర్థి దేపూరు కొండలరావు, శరభన్నపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్(ఐ) అభ్యర్థి లోకుల కన్నాలుపై 3,656 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

తెలుగుదేశం ఆవిర్భావంతో కాంగ్రెస్ హవాకు బ్రేకులు

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో చింతపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ హవాకు బ్రేకులు పడ్డాయి. నియోజకవర్గం ఏర్పాటైన తరువాత వరుసగా నాలుగుసార్లు కాంగ్రెస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1982లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించగా, 1983లో జరిగిన ఎన్నికల్లో 47,566 ఓట్లు పోలయ్యాయి. టీడీపీ తరపున చౌడుపల్లి పంచాయతీకి చెందిన కోరాబు వెంకటరత్నం పోటీ చేసి, కాంగ్రెస్ అభ్యర్థి దేపూరు కొండలరావుపై 1,884 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

- 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో 52,489 ఓట్లు పోలయ్యాయి. కొయ్యూరుకు చెందిన మొట్టడం వీర వెంకట సత్యనారాయణ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కంకిపాటి వీర భద్రరావుపై 14,438 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.
- 1989లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం, వామపక్షాలు, బీజేపీ, జనతాదళ్ తదితర పార్టీలు కూటమిగా ఏర్పడి పోటీ చేశాయి. పొత్తులో భాగంగా చింతపల్లి స్థానాన్ని సీపీఐకి కేటాయించారు. కాంగ్రెస్ అభ్యర్థి పసుపులేటి బాలరాజు, సీపీఐ అభ్యర్థి కొర్రు మల్లయ్యపై 1,999 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- 1994లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం, వామపక్షాలు కూటమిగా ఏర్పడి పోటీ చేశాయి. ఈసారి కూడా చింతపల్లి స్థానాన్ని సీపీఐకి కేటాయించారు. ఈ ఎన్నికల్లో సీపీఐ తొలిసారి గెలుపొందింది. కొయ్యూరు మండలం శరభన్నపాలెం గ్రామానికి చెందిన గొడ్డేటి దేముడు సీపీఐ అభ్యర్థిగా పోటీ చేశారు. మొత్తం 1,05,024 ఓట్లు పోలవ్వగా దేముడుకు 35,257 ఓట్లు, ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే మొట్టడం వీర వెంకట సత్యనారాయణకు 30,175 ఓట్లు, కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే పసుపులేటి బాలరాజుకు 23,497 ఓట్లు వచ్చాయి. 5,082 ఓట్ల మెజారిటీతో దేముడు గెలిచారు.
- 1999 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ జతకట్టగా, వామపక్షాలు విడిగా పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో 1,05,024 ఓట్లు పోలయ్యాయి. టీడీపీ అభ్యర్థి మొట్టడం వీర వెంకట సత్యనారాయణకు 41,163 ఓట్లు, సీపీఐ అభ్యర్థి గొడ్డేటి దేముడుకు 32,892 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బాలరాజుకు కాకుండా కంకిపాటి పద్మకుమారికి టికెట్ ఇచ్చింది. దీంతో బాలరాజు ఇండిపెండెంట్‌గా పోటీ చేసి 14,122 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ పార్టీ నాలుగో స్థానానికి పడిపోయింది.
- 2004లో జరిగిన ఎన్నికల్లో 1,08,530 ఓట్లు పోలయ్యాయి. ఈసారి కాంగ్రెస్, వామపక్షాలు ఒక కూటమి (యూపీఏ)గా, టీడీపీ, బీజేపీ మరో కూటమిగా (ఎన్‌డీఏ) పోటీ చేశాయి. పొత్తులో భాగంగా ఈ స్థానం నుంచి సీపీఐ అభ్యర్థి గొడ్డేటి దేముడు పోటీ చేశారు. దీంతో పుసుపులేటి బాలరాజు అసంతృప్తి చెంది, ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు. దేముడు 52,705 ఓట్లు సాధించి ఎమ్మెల్యేగా గెలిచారు. బాలరాజు 35,223 ఓట్లతో రెండో స్థానంలో, టీడీపీ అభ్యర్థి చిల్లంగి జ్ఞానేశ్వరి 14,471 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. 2008లో నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో చింతపల్లి నియోజకవర్గాన్ని రద్దు చేసి, ఏజెన్సీలోని మూడు మండలాలను పాడేరు నియోజకవర్గంలో విలీనం చేశారు. దీంతో ఐదున్న దశాబ్దాల చరిత్ర వున్న చింతపల్లి అసెంబ్లీ నియోజకవర్గం కనుమరుగైంది. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే చింతపల్లి నియోజకవర్గం మళ్లీ ఏర్పాటు అవుతుందని ఈ ప్రాంతానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

● చింతపల్లి


ఇంగువ రామన్నపడాల్


కోరాబు వెంకట రత్నం


ఎంవీవీ సత్యనారాయణ


గొడ్డేటి దేముడు


పసుపులేటి బాలరాజు


చింతపల్లి మెయిన్ రోడ్

ఉత్తరంలో ఉత్కంఠ

- కూటమి అభ్యర్థిగా విష్ణుకుమార్‌రాజు
- వైసీపీ అభ్యర్థిగా కేకే రాజు
- జై భారత్ పార్టీ తరపున వీవీ లక్ష్మీనారాయణ
- నియోజకవర్గం ఆవిర్భావం నుంచి ఇప్పటివరకూ మూడుసార్లు ఎన్నికలు
- ఒకసారి కాంగ్రెస్, మరొకసారి బీజేపీ/టీడీపీ, ఇంకొకసారి టీడీపీ అభ్యర్థుల గెలుపు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో విద్యావంతులు, సంపన్న వర్గాలకు చెందినవారే అధికం. దీంతో అక్కడ ఓటర్లు ప్రలోభాలకు లొంగిపోకుండా విచక్షణతో ఓటేస్తారనే అభిప్రాయం రాజకీయ పార్టీల్లో ఉంది. 2009లో నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకూ మూడుసార్లు ఎన్నికలు జరిగాయి. ఒకసారి కాంగ్రెస్, మరొకసారి టీడీపీ, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి, ఇంకొకసారి టీడీపీ అభ్యర్థి గెలుపొందారు. ఈసారి ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేస్తున్నాయి. కూటమి అభ్యర్థిగా పి.విష్ణుకుమార్‌రాజు, వైసీపీ అభ్యర్థిగా కమ్మిల కన్నపరాజు (కేకే రాజు) పోటీలో ఉన్నారు. జై భారత్ పార్టీ తరపున సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ బరిలో నిలిచారు.


విష్ణుకుమార్‌రాజు


కేకే రాజు


వీవీ లక్ష్మీనారాయణ

2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన తైనాల విజయ్‌కుమార్ 5,523 ఓట్ల మెజారిటీతో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేసిన షిరీన్ రెహమాన్‌పై విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పెనుమత్స విష్ణుకుమార్‌రాజు పోటీ చేయగా, వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ నుంచి చొక్కాకుల వెంకటరావు పోటీచేశారు. నియోజకవర్గం పరిధిలో మొత్తం 2,22,478 ఓటర్లు ఉండగా వీరిలో 1,37,736 మంది (61.9 శాతం) తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. పోలైన ఓట్లలో విష్ణుకుమార్‌రాజుకు 82,079 (51.34 శాతం) పడగా, వైసీపీ అభ్యర్థి చొక్కాకుల వెంకటరావుకు 63,839 (39.93 శాతం) వచ్చాయి. దీంతో విష్ణుకుమార్‌రాజు 18,240 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఇక 2019 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు వేర్వేరుగా పోటీ చేసినప్పటికీ టీడీపీ నుంచి పోటీ చేసిన గంటా శ్రీనివాసరావు విజయం సాధించారు. మొత్తం 1,77,113 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో 67,352 మంది టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు, 65,408 మంది వైసీపీ అభ్యర్థి కమ్మిల కన్నప్పరాజు (కేకే రాజు)కు ఓటు వేశారు. జనసేన నుంచి పోటీ చేసిన పసుపులేటి ఉషాకిరణ్‌కు 19,139 ఓట్లు, బీజేపీ నుంచి పోటీ చేసిన విష్ణుకుమార్‌రాజుకు 18,790 ఓట్లు లభించాయి. ఈసారి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయి. ఉమ్మడి అభ్యర్థిగా బీజేపీకి చెందిన విష్ణుకుమార్‌రాజును పోటీ చేస్తున్నారు. వైసీపీ నుంచి గత ఎన్నికల్లో పోటీచేసి ఓటమి పాలైన కేకే రాజు తిరిగి పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా విశాఖ పార్లమెంటు స్థానానికి పోటీ చేసిన వీవీ లక్ష్మీనారాయణ ఈసారి ఉత్తరం నియోజకవర్గం నుంచి బరిలో ఉన్నారు. ఉత్తర నియోజకవర్గ పరిధిలో సీతమ్మధార, బాలయ్యశాస్త్రీ లేఅవుట్, సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్, మురళీనగర్, మాధవధార, 104 ఏరియా, అక్కయ్యపాలెం, కంచరపాలెం (కొంత భాగం) ఉన్నాయి.



పరిశ్రమల పరిరక్షణతో మేలు



స్టీల్‌ప్లాంట్ లాంటి భారీ ప్రభుత్వ రంగసంస్థలను కాపాడే ప్రభుత్వాలు కావాలి. ప్రైవేటుకు అప్పగిస్తే దేశ, రాష్ట్ర ఆర్థిక రంగం పూర్తిగా దెబ్బతిని, భవిష్యత్తు భారతం అప్పులపాలవుతుంది. పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, కొత్తగా ప్రభుత్వరంగ సంస్థలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన రాజకీయ పార్టీలను ఎన్నుకుందాం. ఓటర్లు ఆలోచించి సమాజానికి మేలుచేసే నాయకులకు మద్దతు ఇవ్వాలి. - పి.లక్ష్మి, అల్లిపురం, విశాఖపట్నం

ఉక్కును కాపాడేవారికే ఓటు



విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా అడ్డుకుంటామని భరోసా ఇచ్చే నేతలు, పార్టీకే నగరవాసులు ఓటు వేయాలి. కార్మికులు మూడు సంవత్సరాలుగా ఉద్యమాలు చేస్తున్నా స్పష్టమైన హామీ లభించలేదు. ఎన్నికల సమయం వచ్చింది. ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడిన నాయకులను చట్ట సభలకు పంపాలి. ఇప్పటివరకు మాటలతో మోసం చేసిన నాయకులను తరిమికొట్టాలి.

- డి.తాతారావు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి, గాజువాక

సమర్థ నాయకుడ్ని ఎన్నుకోండి



రాజధాని, పోలవరం సత్వరమే పూర్తి చేయగల సమర్థ నేత ఉన్న పార్టీకి ఓటువేసి అధికారంలోకి తెచ్చుకోవాలి. భావ, వాక్ స్వాతంత్ర్యాన్ని గౌరవించే నేతల అవసరముంది. రాజ్యాంగ వ్యవస్థలను లెక్కచేయకుండా నియంతలా వ్యవహరిస్తూ, భూకబ్జాలకు పాల్పడుతున్నవారికి ఓటుతో బుద్ధి చెప్పాలి. యువతకు ఉపాధి, రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా నడిపించే సత్తా ఉన్న నాయకుడు అవసరం. తాయిలాలు, ఉచితాలకు, ప్రలోభాలకు లొంగి అనర్హులకు ఓటు వేస్తే భవిష్యత్తు తరాలకు అన్యాయం జరుగుతుంది. - ఎస్ఎస్ శాస్త్రి, విశాఖపట్నం

ప్రభుత్వ ఆదాయం పెంచేవారికే ఓటు



పూర్తిగా అప్పుల్లో మునిగిపోయిన రాష్ట్రాన్ని ఆదుకునే నాయకుడ్ని ఎన్నుకోవాలి. ఉచితాల పేరుతో ఇప్పటికే నాశనమైపోయిన వ్యవస్థను గాడిన పెట్టేందుకు ఆదాయం పెంచే నేత అవసరం. అతనికే ఓటు వేయాలి. నిత్యావసర సరకుల ధరలు తగ్గించి సామాన్యుడ్ని ఆదుకునే ముఖ్యమంత్రిని ఎన్నుకోవాలి. ఉచిత విద్య, వైద్యం, అందరికీ అందుబాటులో ఉండాలి. యువతకు ఉపాధి గురించి ఆలోచించాలి. ఇలాంటి ఆలోచనలతో ఉన్న అభ్యర్థులను చట్టసభలకు పంపితే మేలు జరుగుతుంది. ఆలోచించి ఓటు వేయాలి. - జీఎస్‌డీవీ రామారావు, అనకాపల్లి

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243

నాడు కుగ్రామం... నేడు మహా నగరం

- ఊహించని స్థాయిలో విస్తరించిన విశాఖ
- కేవలం ఒక్క నియోజకవర్గం నుంచి ఐదింటికి పెరిగిన వైనం
- 68 వేల నుంచి 17 లక్షలకు పెరిగిన నగర ఓటర్లు



(ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం)

విశాఖపట్నం ఒకప్పుడు అతిచిన్న మత్స్యకార పల్లె. కుగ్రామంగా ప్రస్థానం ప్రారంభమయింది. డెబ్బై ఎనభై ఏళ్లలో ఎవరూ ఊహించని స్థాయిలో విస్తరించింది. తొలి సాధారణ ఎన్నికల్లో విశాఖపట్నం ఒక్కటే అసెంబ్లీ నియోజకవర్గంగా ఉండేది. దేశంలో తొలిసారిగా 1952 ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో విశాఖపట్నం అసెంబ్లీ ఓటర్ల సంఖ్య కేవలం 68,282 మంది మాత్రమే. కానీ నగరం విస్తరించి ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు, శివారు ప్రాంతాలతో కలిసి మరో రెండు నియోజకవర్గాలు ఏర్పడ్డాయి.

విశాఖ నగర ఓటర్ల సంఖ్య ప్రస్తుతం 17 లక్షలకు చేరింది. జిల్లా ఓటర్ల సంఖ్య 20 లక్షల మార్కు దాటింది. ఇందులో ఆనందపురం, పద్మనాభం, భీమిలి గ్రామీణం, సబ్బవరం, పరవాడ ప్రాంతాల్లో సుమారు మూడు లక్షల ఓటర్లున్నారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో జరిగిన 1952 మొదటి ఎన్నికలలో విశాఖ ఒకటే అసెంబ్లీ నియోజకవర్గం. ఆ ఎన్నికల్లో ఓటర్లసంఖ్య కేవలం 68,282. తొలి ఎన్నికల్లో తెన్నేటి విశ్వనాథం ఎమ్మెల్యేగా ఎన్నికై రికార్డు సృష్టించారు. తరువాత విశాఖ విస్తరించే క్రమంలో 1955 మధ్యంతర ఎన్నికలలో విశాఖతోపాటు కణితి (నగరంలో కణిత బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించిన ప్రాంతం) కేంద్రంగా రెండో అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటుచేశారు. దీంతో విశాఖ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఓటర్ల సంఖ్య 58,132 మందికి తగ్గారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా నియోజకవర్గాలు ఏర్పాటుచేసిన క్రమంలో విశాఖ క్రమసంఖ్య 23. తొలి సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాల నంబరులో విశాఖ 19. 1962లో జరిగిన మూడో సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ అసెంబ్లీ ఓటర్ల సంఖ్య 71,794కు పెరిగింది. ఆ తరువాత జనాభా మేరకు ఓటర్ల సంఖ్య పెరుగుతూ వచ్చింది. 1967 ఎన్నికల సమయానికి కణితి అసెంబ్లీని రద్దుచేసి విశాఖ-1, విశాఖ -2 సెగ్మెంట్లు ఏర్పాటయ్యాయి. 2004 వరకు కొనసాగాయి. అప్పుడు విశాఖ-1లో 1,27,044, విశాఖ-2లో ఓటర్లసంఖ్య 4,03,262కు పెరిగింది. నియోజకవర్గాల పునర్విభజన తరువాత విశాఖ తూర్పు, దక్షిణ, ఉత్తర, పశ్చిమ, గాజువాక నియోజకవర్గాలు నగర పరిధిలో, భీమిలి, పెందుర్తిలో అత్యధిక ప్రాంతాలు వచ్చి చేరాయి.

కలిసొచ్చిన అదృష్టం

భీమిలిలో నాలుగుసార్లు జయకేతనం

- ఆర్ఎస్‌డీపీ అప్పలనరసింహరాజు రాజకీయ ప్రస్థానం


ఆర్ఎస్‌డీపీ అప్పలనరసింహరాజు

జిల్లాలో భీమునిపట్నం ప్రత్యేకత కలిగిన అసెంబ్లీ నియోజకవర్గం. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి వరుసగా నాలుగుసార్లు అదే పార్టీకి చెందిన అభ్యర్థి ఆర్ఎస్‌డీపీ అప్పలనరసింహరాజు విజయం సాధించడం ఇక్కడ ప్రత్యేకం. ఎలాంటి రాజకీయ పరిచయం లేని వ్యక్తి వరుస విజయాలను అందుకోవడం అప్పట్లో సంచలనం.

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలో భీమిలి నుంచి పూసపాటి ఆనందగజపతిరాజు పోటీచేసి విజయం సాధించారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో విద్యాశాఖా మంత్రిగా పనిచేశారు. 1985లో నాదెండ్ల భాస్కరరావు ఉదంతం అనంతరం ఎన్టీఆర్ అసెంబ్లీని రద్దుచేసి కొత్తవారికి టికెట్లు ఇచ్చారు. ఆ సమయంలో పద్మనాభం మండలం పాండ్రంగి గ్రామానికి చెందిన అప్పల అప్పలనరసింహరాజుకు టికెట్ లభించింది. ఏమాత్రం రాజకీయ అనుభవం లేని వ్యక్తికి ఎన్టీఆర్ టికెట్ ఇవ్వడమే గొప్ప విషయమైతే... ఆ ఎన్నికల్లో ఆయన మంచి మెజారిటీతో విజయం సాధించడం మరో విశేషం.

కలిసొచ్చిన అంశాలివి...

తొలిసారి భీమిలి నుంచి ఆర్ఎస్‌డీపీ రంగంలోకి దిగే సమయంలో కాంగ్రెస్ తరపున పోటీకి డిమాండ్ ఉండేది. ఆ పార్టీ ప్రొఫెసర్ ఆకెళ్ల శేషగిరిరావుకు టికెట్ ఇచ్చింది. దీంతో నియోజకవర్గంలోని సీనియర్ నేతలు ఎవరూ అతనికి సహకరించలేదు. దీంతో అప్పలనరసింహరాజు విజయం నల్లేరు మీద నడకలా సాగిపోయింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీకి అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. కాగా విజయనగరం జిల్లా అలమండకు చెందిన కాకర్లపూడి సూర్యనారాయణరాజుకు కాంగ్రెస్ బి ఫారం ఇచ్చింది. ఈలోగా పీసీసీ అధ్యక్షుడి మార్పు జరగడంతో విశాఖపట్నానికి చెందిన సుంకర ఆళ్వారుదాసుకు కూడా బి ఫారం లభించింది. ఇద్దరూ కాంగ్రెస్ అభ్యర్థులుగానే నామినేషన్లు వేశారు. దీంతో ఈసీ ఇద్దరినీ స్వతంత్ర అభ్యర్థులుగా ప్రకటించడంతో బ్యాలెట్‌లో హస్తం గుర్తుకు చోటు దక్కలేదు. దీంతో అప్పలనరసింహరాజు సునాయాసంగా విజయం సాధించారు.

మూడో సారీ... అదే రీతి

మూడోసారి పోటీలో టీడీపీ మండలాధ్యక్షుడు కోరాడ శంకరరావు కాంగ్రెస్‌లో టికెట్ సాధించారు. దీంతో కాంగ్రెస్ ఆశావహులు సహకరించలేదు. పైగా అప్పలనరసింహరాజు విజయానికి కృషి చేశారు. ఇక నాల్గోసారి ఇలాంటి పరిస్థితి పునరావృతమయింది. పాత ప్రత్యర్థులే మళ్లీ తలపడ్డారు. శంకరరావుపై వ్యతిరేకత అప్పలనరసింహరాజుకు విజయం సాధించిపెట్టింది. అయితే 2009లో సింహాచలం సర్పంచి కర్రి సీతారామ్ కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలోకి దిగడం, బలమైన అతని సామాజికవర్గం సహకరించడంతో అప్పలనరసింహరాజుకు ఓటమి తప్పలేదు. అనంతరం అతనికి మళ్లీ పోటీచేసే అవకాశం దక్కలేదు. దీంతో తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ అభ్యర్థుల విజయానికి సహకరిస్తున్నారు.

● భీమునిపట్నం రూరల్



వాడవాడలా కార్మిక దినోత్సవం


అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ వద్ద మే డే జరుపుకుంటున్న కార్మికులు


నక్కపల్లి: ఉపమాక పల్లపువీధిలో కార్మిక జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, మే 1: పట్టణంలో కార్మిక దినోత్సవాన్ని సీఐటీయూ, ఏఐటీయూసీ ప్రతినిధులు బుధవారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జీవీఎంసీ కార్యాలయం, బేవరేజెస్ కార్పొరేషన్, పార్శిల్ ముఠా కార్మికులు, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, జాతీయ రహదారిలతో పాటు ఆర్టీసీ డిపో వద్ద, సీఐటీయూ కార్యాలయం వద్ద, శంకరం ఎరువుల గోదాం వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు జెండాలు ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో కరణం కొండలరావు, గంటా శ్రీరామ్, బొమ్మల రాము, ఎం. రాము పాల్గొన్నారు. అలాగే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో వైఎస్ భద్రం పతాకావిష్కరణ చేశారు. సీపీఐ కార్యాలయం వద్ద జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ జెండా ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజాన దొరబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు. అల్యూమినిమం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గాంధీ చౌక్ వద్ద నీలకంఠశ్యామ్ పతాకావిష్కరణ చేశారు. మాజీ కౌన్సిలర్ తాకాశి వెంకటేశ్వరరావు, కోరిబిల్లి శంకరరావు, ఎం. సూరిబాబు పాల్గొన్నారు.

తుమ్మపాలలో.. అనకాపల్లి మండలం మామిడిపాలెం,బవులవాడ, మార్టూరు తదితర గ్రామాల్లో బుధవారం ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీపీఐ, ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమాల్లో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కశింకోటలో.. మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన మే డే వేడుకల్లో యూనియన్ జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఎం.నాగేశ్వరరావు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, మోటార్ అండ్ ఆటో కార్మికులు, పంచాయతీ కార్మికులు, క్రైబ్స్ కార్మికులు పాల్గొన్నారు.

పరవాడలో.. పరవాడ, పరిసర ప్రాంతాల్లో బుధవారం మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫార్మాసిటీలోని విజయశ్రీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. బయోకాన్ పరిశ్రమ వద్ద సీఐటీయూ యూనియన్ ప్రధానకార్యదర్శి వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ జెండాను ఆవిష్కరించారు. కొత్తపాలెం ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వెంకునాయుడు జెండాను ఆవిష్కరించారు. సింహాద్రి జంక్షన్‌లో సీఐటీయూ నాయకుడు కె. శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించారు. తాడి ముఠా వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ జెండాను ఆవిష్కరించారు. పరవాడలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు.

రాంబిల్లిలో.. మండలంలోని వెల్చూరు, కొత్తపట్నం, రాంబిల్లి, వైలోవ, పెదకలవలాపల్లి, నేవీగేట్, మామిడివాడ, భోగాపురం, వెంకటాపురం గ్రామాల్లో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని సీఐటీయూ, స్థానిక నేతలు పతాక ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు, ప్రజాప్రతినిధులు కిల్లాడ చినబాబు, రాంబాబు, అంగా రవి పాల్గొన్నారు.

సబ్బవరంలో.. మండల కేంద్రంలో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం మండల నాయకురాలు ఉప్పాడ సత్యవతి జెండాను అవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు గౌరీసు, కార్మిక సంఘం నేతలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద బుధవారం కార్మికులు మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ మెంబరు గనిశెట్టి ఏసుదాసు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం, రైస్ మిల్ ముఠా వర్కర్స్, ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులు, వై.నూకరాజు, సీహెచ్. వెంకటరమణ, పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

నక్కపల్లిలో.. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మే డే వేడుకలను కార్మిక సంఘాలు ఘనంగా జరుపుకున్నాయి. స్థానిక ఆటో స్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలు జరిగాయి. ఉపమాక పల్లపువీధి రామాలయం వద్ద కార్మిక జెండాను సత్తెమ్మతల్లి లేబరు సంఘం అధ్యక్షుడు చిలకా సూరిబాబు, కొల్నాటి బుజ్జి, గొల్లపల్లి వెంకట అప్పారావు, కనకరాజు ఎగురవేశారు. ఉపమాక మెరకవీధి రామాలయం వద్ద కూడా నేతాజీ లేబరు యువజన సంఘం, సీతారామాంజనేయ యువజన సంఘం, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మే డే వేడుకలు జరిగాయి.

ఎస్.రాయవరంలో.. మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో మే డే వేడుకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు అడ్డరోడ్డు, నీలాద్రిపురం, పెట్టుగోళ్లపల్లి, ధర్మవరం అగ్రహారం గ్రామాల్లో ముఠా కార్మిక సంఘం సభ్యుల ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ జెండాను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, త్రిమూర్తులు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈజడ్ నిర్వాసితులను ముంచిన వైసీపీ ప్రభుత్వం

▸▸ జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్

రాంబిల్లి, మే 1 : మండలంలోని వెల్చూరు, సంతపాలెం, గొరపూడి, లాలంకోడూరు పంచాయతీల్లో బుధవారం కూటమి నేతల ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్, బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరుడు సీఎం రాజేష్, టీడీపీ, బీజేపీ నాయకులకు మహిళలు హారతులు పట్టారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఉమ్మడి మేనిఫెస్టో గురించి వివరించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని సమస్యలను ప్రజలు కూటమి నేతల దృష్టికి తీసుకువచ్చారు. ఆయా గ్రామాల్లో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ.. ఎస్ఈజడ్ నిర్వాసిత రైతులను వైసీపీ ప్రభుత్వం నిలువునా ముంచిందని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు నిర్వాసితులైన రైతులకు న్యాయం చేయకుండా.. ప్రశ్నించే రైతులు, ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి వేధించారన్నారు. తనకు ఒక్క అవకాశం ఇవ్వండి.. న్యాయం చేస్తానని.. అభివృద్ధి ఏమిటో చూపిస్తానన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు గాజుగ్లాసు గుర్తుపైన, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటువేసి గెలిపించాలని కోరారు. సీఎం రమేశ్ సోదరుడు రాజేష్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే కన్నబాబు రాజు అన్నివర్గాల ప్రజలకు అన్యాయం చేశారన్నారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో కలిగే లాభాలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, కారే రాముడు, లాలం తాతబాబు, కలిదిండి రఘురాజు, కిల్లాడ చిన్న, లాలం చందు, డీఎస్ఎన్‌రాజు(బుజ్జి) లాలం రమేష్‌నాయుడు, లాలం సత్యప్రసాద్, రేబాక ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.


లాలంకోడూరులో మాట్లాడుతున్న లాలం భవాని. చిత్రంలో సుందరపు విజయకుమార్, సీఎం రాజేశ్, లాలం చందు ఉన్నారు.

చీడిక, జి.జగన్నాథపురంలో అనితకు అపూర్వ స్వాగతం

నక్కపల్లి, మే1: మండలంలోని చీడిక, జి. జగన్నాథపురాల్లో బుధవారం ఉదయం టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లో మహిళలు ఆమెకు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఐదు దశాబ్దాలుగా తమ గ్రామానికి రోడ్డు లేకపోతే ఎమ్మెల్యేగా వున్న సమయంలో అనిత రోడ్డు వేయించారని చీడిక మహిళలు ఆమెను సత్కరించారు. అనంతరం ప్రచార రథంపై నుంచి అనిత మాట్లాడుతూ.. మరో పది రోజుల తరువాత ప్రజలంతా జగన్‌ను ఇంటికి పంపేయడానికి సిద్ధంగా వున్నారన్నారు. ఎన్డీఏ కూటమి ఏర్పడిన తరువాత ప్రజల కష్టాలు తీరుతాయని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, జి. జగన్నాథపురం మాజీ సర్పంచ్ నానేపల్లి రాఘవులు, ఉప సర్పంచ్ మారిశెట్టి నానాజీ పాల్గొన్నారు.


అనితకు ఘనస్వాగతం పలుకుతున్న మహిళలు

కూటమితోనే రాష్ట్రంలో జనరంజక పాలన

▸▸ జనసేన నాయకుడు పంచకర్ల వెంకటేశ్వరరావు

సబ్బవరం, మే 1 : రాష్ట్రంలో కూటమితోనే జనరంజక పాలన సాధ్యమని జనసేన నాయకుడు పంచకర్ల వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని అమృతపురం, పైడివాడఅగ్రహారంల్లో కూటమి నేతలతో కలిసి ఆయన ఉపాధి కూలీలను కలిసి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన అంశాలను వివరించారు. వృద్ధులకు నెలకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు తదితర హామీలను వివరించారు. గండి వంశీ ప్రదీప్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబుకు గాజు గ్లాసుపైన, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటేసి గెలిపించాలని కోరారు. అదే విధంగా చిన్నయ్యపాలెం, సబ్బవరం, సాయినగర్ తదితర గ్రామాల్లో కూటమి శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించి, మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంల్లో ఎంపీటీసీ సభ్యుడు సీరం అప్పలరాజు, ఇందలి రమణ, కన్నారావు, దుర్గినాయుడు, మహాలక్ష్మనాయుడు, వెంకటేశ్వరరావు, బీఏ రావు పాల్గొన్నారు.


పైడివాడఅగ్రహారంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పంచకర్ల వెంకటేశ్వరరావు

వైసీపీ నేతల కబంధ హస్తాల్లో ఉత్తరాంధ్ర భూములు

... 3వ పేజీ తరువాయి

అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. అచ్యుతాపురంలో గురువారం జరిగిన వారాహి యాత్రలో పాల్గొన్న ఆయన స్థానిక ఎమ్మెల్యే కన్నబాబు రాజుపై విరుచుకుపడ్డారు. ఐదేళ్లలో కన్నాల రాజు భూదందాలు, సెజ్ కర్మాగారాల్లో దందాలతో కోట్లు ఆర్జించాడే తప్ప ఒక్క అభివృద్ధి కార్యక్రమమైనా చేశాడా? అని ప్రశ్నించారు. సెజ్ పేరుతో అధికారుల ద్వారా నోటీసులు ఇప్పించడం, రైతులను భయభ్రాంతులకు గురిచేసి వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించి కోట్లు ఆర్జించాడన్నారు. కొండలు, గుట్టలు అనే తేడా లేకుండా ఆక్రమించుకున్నాడన్నారు. అలాగే సింహాచలం దేవస్థానానికి చెందిన భూమిని ఆక్రమించి భారీ భవనాన్ని నిర్మించుకున్నాడన్నారు. కొండలు, గుట్టలు, గాలి, నీరు, నిప్పు ఎవడి సొత్తు కాదు. మనది, మనందరిది.. వీటిని ఆక్రమించుకోవడానికి వారికి ఏమి హక్కుంది? అని ఆయన ఆవేశంగా అన్నారు. అలాంటి వారికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలా?, వద్దా? అని ప్రశ్నించారు. బుద్ధి చెప్పాలి.. చెప్పాలి అని జనం కేకలు వేశారు. నియోజక వర్గంలో ప్రజలకు స్వాతంత్ర్యం లేదు. ఏది అడిగినా పోలీసు కేసులు. అలాగే ఒక విద్యార్థి ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి అడిగితే చెంప మీద కొట్టాడు. అలాంటి వ్యక్తికి మళ్లీ ఓటు వేయాలా?.. అనగానే వద్దు, వద్దు అంటూ జనం సమాధానమిచ్చారు. ఎలమంచిలి అభివృద్ధి చెందాలంటే సుందరపు విజయకుమార్, అనకాపల్లి జిల్లా అభివృద్ధి చెందాలంటే సీఎం రమేశ్‌ను గెలిపించాలన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వస్తే ముందుగా కన్నాల రాజు మీ ఇళ్లను కూడా కబ్జా చేస్తాడని అన్నారు. స్థానిక అధికారులకు చెప్పినా అక్కడ వాళ్ల అధికారులే ఉంటారు కనుక వారు ఏమీ చేయరన్నారు. అప్పుడు హైకోర్టుకు వెళ్లాలన్నారు. ఒక పార్టీ నడుపుతూ, జనాదరణ ఉన్న తానే హైకోర్టుకి వెళ్లలేనని, ఇక సామాన్యులెలా వెళతారని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో జీవన భృతి, పూడిమడకలో హార్బర్ నిర్మాణం చేస్తామని చెప్పారు.

కరప్షన్ కింగ్ అదీప్‌రాజ్

పెందుర్తి: గత ఎన్నికల్లో పెందుర్తి నియోజకవర్గ ఓటర్లు యువకుడైన అదీప్‌రాజ్ మేలు చేస్తాడని గెలిపిస్తే కరప్షన్ కింగ్‌గా మారాడని పవన్ కల్యాణ్ విమర్శించారు. రాష్ట్రస్థాయిలో జగన్ దోచుకుంటే, నియోజకవర్గ స్థాయిలో అతను దోచేస్తున్నాడన్నారు. ఈ ప్రాంతంలో ప్లాట్ కొనాలన్నా అదీప్‌రాజ్ మనుషులకు డబ్బులు చెల్లించాల్సి వస్తోందన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని తరలించాల్సిందిగా ప్రజలు కోరుతున్నా జగన్ పట్టించుకోలేదని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ బాధ్యతను తీసుకుంటామని పవన్ కల్యాణ్ స్పష్టంచేశారు. యువతకు ఉద్యోగాలు రావాలంటే పరిశ్రమలు రావాలని, కానీ, ఆ పరిశ్రమల వల్ల ఎవరూ బలి కాకూడదన్నారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఇక్కడి ప్రజల సమస్యలకు పరిష్కారాన్ని చూపించకుండా..కబ్జాలు, సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నాడన్నారు. అదీప్‌రాజ్ ఓటు అడగానికి వస్తే గెట్ లాస్ట్ అదీప్, గెట్ లాస్ట్ జగన్..అని చెప్పాలని పవన్ సూచించారు. పెందుర్తిలో చట్టాలు, రాజ్యాంగం లేదా..? అని ప్రశ్నించిన పవన్..అదీప్‌రాజ్ నువ్వు జస్ట్ ఎమ్మెల్యే మాత్రమేనని గుర్తుంచుకోవాలన్నారు. పంచగ్రామాల సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని, అసెంబ్లీలో ఈ ప్రాంత గళం వినిపిస్తానని పవన్ స్పష్టంచేశారు. చెత్త పన్నును చెత్తలో పడేస్తామని, చెత్తపై పన్ను వేసిన ఈ ప్రభుత్వాన్ని కూడా చెత్తలో పడేద్దామని స్పష్టం చేశారు.

హామీలు అమలు చేసే బాధ్యత మాదీ

మేనిఫెస్టోలోని హామీలను అమలు చేసే బాధ్యత తమదని పవన్ కల్యాణ్ స్పష్టంచేశారు. ఉమ్మడి మేనిఫెస్టోను స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అన్ని వర్గాలకు మేలు చేసేలా రూపొందించామన్నారు. ఎంపీగా సీఎం రమేష్‌ను, ఎమ్మెల్యేగా పంచకర్ల రమేశ్‌బాబును గెలిపించాలని, వీరిద్దరితో పని చేయించే బాధ్యతను తాను తీసుకుంటానన్నారు.

భర్త గెలుపు కోసం..

▸▸ సీఎం రమేశ్ భార్య శ్రీదేవి ప్రచారం


ఉప్పరాపల్లిలో ప్రచారం చేస్తున్న సీఎం శ్రీదేవి

ఎస్.రాయవరం, మే 1: బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ గెలుపు కోసం ఆయన సతీమణి సీఎం శ్రీదేవి బుధవారం మండలంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఉప్పరాపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనితకు సైకిల్ గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి. రవిరాజు, మండల అధ్యక్షుడు బి జోగునాయుడు, టీడీపీ నాయకులు కందుల వెంకటేశ్వరరావు, తుంపాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'డిజిటల్ నైపుణ్యంతో విద్యార్థులు శక్తివంతం కావాలి'


మాట్లాడుతున్న కొయిలాడ రామ్మోహనరావు

అనకాపల్లి టౌన్, మే 1: డిజిటల్ నైపుణ్యంతో విద్యార్థులు శక్తివంతం కావాలని ఏఎంఏఎల్ కళాశాల రసాయన శాస్త్ర మాజీ విభాగ అధిపతి కొయిలాడ రామ్మోహనరావు పేర్కొన్నారు. బుధవారం గౌరీ గ్రంథాలయంలో కంప్యూటర్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న సాంకేతికను అందిపుచ్చుకోవాలన్నారు. విద్యార్థులు ప్రాథమిక అంశాలను గ్రహించడమే కాకుండా విభిన్న సందర్భాలలో వివిధ కంప్యూటర్ అప్లికేషన్‌లను ఎలా అన్వయించుకోవాలో కూడా అర్థం చేసుకోవాలన్నారు. గౌరీ గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రంథాలయ అధ్యక్షుడు డి. నూకఅప్పారావు, సభ్యులు సామాజికవేత్త పిల్లా కోటేశ్వరరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్, శిక్షకులు శరగడం కిశోర్, ఇ. ఇందిర, కె. నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు కేటాయింపు

నక్కపల్లి, మే 1: పాయకరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో పోలింగ్ కేంద్రాల వారీగా బ్యాలెట్ కంట్రోల్, వీవీ ప్యాడ్‌ల కేటాయింపుపై సమావేశం నిర్వహించారు. మొత్తం 292 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏ పోలింగ్ కేంద్రానికి ఏ నంబర్ల ఈవీఎంలు వుంటాయో తెలియజేసే జాబితాలను అభ్యర్థులకు ఆర్వో కె.గీతాంజలి అందజేశారు. సాయంత్రం అభ్యర్థుల ఎన్నికల ఖర్చుకు సంబంధించి పరిశీలకులు సంజయ్ గాంధీ సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎలక్షన్ డీటీ చైన్‌లు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

▸▸ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వీరరాఘవేంద్రరావు


సమావేశంలో ప్రసంగిస్తున్న ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ టి.వీరరాఘవేంద్రరావు

ఎలమంచిలి, మే 1: కార్మిక చట్టాలపై కార్మికులు అవగాహన పెంపొందించుకోవాలని ఎలమంచిలి అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ టి. వీరరాఘవేంద్రరావు అన్నారు. బుధవారం స్థానిక ఆటో స్టాండ్ వద్ద మే డే సందర్భంగా కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వీర రాఘవేంద్రరావు కార్మిక చట్టాల గురించి కార్మికులకు అవగాహన కల్పించారు. కార్మిక చట్టాలకు భంగం కలిగినప్పుడు మండల లీగల్ సర్వీసెస్‌ను ఆశ్రయించాలన్నారు. కనీస వేతనాల చట్టం, వేతన చెల్లింపుల చట్టం, గ్రాట్యూటీ చెల్లింపు చట్టం తదితర పలు కార్మిక చట్టాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు బి. హరిశంకరరావు, పెరుమాళ్ల వెంకటరమణ, ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ మెంబరు గనిశెట్టి ఏసుదాసు, ఆటో సంఘం అధ్యక్షుడు అల్లిమల్ల నాగు, లక్ష్మణరావు, నగిరెడ్డి శివ, సీహెచ్. సత్యనారాయణ, విశ్వనాథం పాల్గొన్నారు.

జన ప్రభంజనం

... 3వ పేజీ తరువాయి

ఎదురు చూశారు. సరిగ్గా 4.35 గంటలకు పవన్ వారాహి రథం మీదకు వచ్చారు. ముందుగా నవ్వుతూ అందరికీ అభివాదం చేశారు. పవన్ కల్యాణ్ తన ప్రసంగం పారంభించే ముందు కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం 5.20 గంటలకు పవన్ ప్రసంగం ముగిసింది. సభ అనంతరం వచ్చిన జనం తిరిగి వెళ్లడానికి చాలా సమయం పట్టింది. అచ్యుతాపురం నాలుగు రోడ్ల కూడలి జనాలతో నిండిపోయింది. పోలీసులు ముందుగానే అచ్యుతాపురం జంక్షన్‌లో పూడిమడక రోడ్డు వైపు బారికేడ్లతో రాకపోకలను నిషేధించారు. సమావేశం తరువాత నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి ఎటు చూసినా రెండు కిలోమీటర్ల మేర జనంతో నిండిపోయింది. సాయంత్రం ఆరు వరకు ట్రాఫిక్ క్లియర్ కాలేదు. సమావేశానికి సుమారు 20 వేల మంది వచ్చి ఉంటారని అంచనా.

పెందుర్తిలో.. పెందుర్తి జనసంద్రాన్ని తలపించింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి విజయభేరి యాత్ర ప్రభంజనం సృష్టించింది. బుధవారం సాయంత్రం అచ్యుతాపురంలో సభ ముగించుకుని పవన్ కల్యాణ్ హెలికాప్టర్‌లో సరిపల్లిలోని హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా ప్రజలకు అభివాదం చేస్తూ పెందుర్తి జంక్షన్‌లోని సభాస్థలికి చేరకున్నారు. జన సైనికులతో పాటు టీడీపీ, బీజేపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు వెల్లువలా తరలిరావడంతో పెందుర్తి కిక్కిరిసిపోయింది. పవన్ ప్రసంగిస్తున్నంత సేపు అభిమానులు కేరింతలు, నృత్యాలతో హోరెత్తించారు. మహిళలు, కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలుపుతూ పవన్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తూటాల్లాంటి మాటలతో వైసీపీ అధినేత జగన్‌పై ధ్వజమెత్తారు. శ్రీశ్రీ, శేషాద్రి కవితలతో ఓటర్లను చైతన్యపరుస్తూ, వైసీపీ అరాచకాలను ఎండగడుతూ ప్రసంగించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో రాష్ట్రంలో సునామీ రాబోతుందన్నారు.

పగిలే కొద్దీ గాజు పదునెక్కుతుంది

గాజు పగిలే కొద్దీ పదునెక్కుతుందని..ప్రజల్ని పీడిస్తున్న జలగ జగన్‌ను గద్దె దించేందుకు తాను తగ్గి కూటమి కట్టానన్నారు. ప్రజలు భయం గుప్పిట్లో బతుకున్నారన్నారు. ప్రజాధనాన్ని రాబందుల్లా దోచేస్తున్న జగన్ రెడ్డి, పెద్దిరెడ్డి, సుబ్బారెడ్డి ఆగడాలకు అంతం పలకాలని యువతకు పిలుపునిచ్చారు.

బీజేపీలో చేరిన స్వతంత్ర అభ్యర్థి హరిశంకర్


సీఎం రమేశ్ సమక్షంలో బీజేపీలో చేరిన హరిశంకర్

కొత్తూరు, మే 1 : భారతీయ జనతా పార్టీలోకి ఇండిపెండెంట్ అభ్యర్థి డాక్టర్ హరిశంకర్ బుధవారం చేరారు. బీజేపీ కార్యాలయంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరిశంకర్ మాట్లాడుతూ సీఎం రమేశ్ విజయానికి కృషి చేస్తానని చెప్పారు. ఆయన గెలుపుతోనే అనకాపల్లి అభివృద్ధి సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

ఉపాధి కూలి రూ.400 ఇస్తాం

▸▸ కాంగ్రెస్ అభ్యర్థి ఐఆర్.గంగాధర్

కశింకోట, మే 1 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఉపాధి హామీ కూలీలకు రోజువారీ కూలి రూ.400 ఇస్తామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఐ.ఆర్. గంగాధర్ అన్నారు. బుధవారం మండలంలోని తేగాడ, బయ్యవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా తేగాడలో ఉపాధి కూలీలతో మాట్లాడుతూ. గ్రామీణ వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఉపాధి హామీ పథకాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చట్టాన్ని తీసుకుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కమిటీ మండల అధ్యక్షుడు సనేడ గజ్జాలు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దాసరి సంతోష్, డీసీసీ కార్యదర్శి ఎగ్గాడ భాస్కరరావు, నాయకులు కొల్లి సత్యారావు, నందికి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నిప్పులు చెరిగిన సూర్యుడు


నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న పరవాడ ప్రధాన రహదారి

పరవాడ, మే 1 : పారిశ్రామికవాడగా పేరొందిన పరవాడ ప్రాంతంలో ఎండల తీవ్రత కొనసాగుతూనే ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పరవాడ, పరిసర ప్రాంతాల్లో బుధవారం 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగింది. ఎండలకు తోడు విపరీతమైన వడగాడ్పులు వీయడంతో ప్రజలు అల్లాడిపోయారు. ఉదయం పది గంటలకే రహదారులన్నీ నిర్మానుష్యం అయ్యాయి.

'వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి'

రాంబిల్లి, మే 1 : అవినీతిలో కూరుకుపోయిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కాంగ్రెస్ పార్టీ ఎలమంచిలి అభ్యర్థి తనకాల అనంతరావు కోరారు. బుధవారం ఆయన ఆ పార్టీ శ్రేణులతో కలిసి మండలంలోని దిమిలి, కట్టుబోలు, రాజాల, తెరువుపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకార సెల్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ సుభద్రరావు, డీసీసీ ప్రధాన కార్యదర్శి రావి రామసత్యం, డీసీసీ ఉపాధ్యక్షుడు పొలమరశెట్టి ఆదిమూర్తి, నేతలు భీశెట్టి పెంటారావు, కె.సంజీవ్, లక్ష్మి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరిన 'గంధం'


వైసీపీ నేత గంధం శివ జనసేనలోకి ఆహ్వానిస్తున్న సుందరపు

ఎలమంచిలి, మే 1: మునిసిపాలిటీ 4వ వార్డు వైసీపీ నేత గంధం శివ బుధవారం అచ్యుతాపురంలో జనసేన అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయకుమార్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. శివను సుందరపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హాకీ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం


హాకీ క్రీడాకారులకు స్టిక్‌లు పంపిణీ చేస్తున్న కృష్ణవేణి

ఎలమంచిలి, మే 1: పట్టణంలోని రాజీవ్‌గాంధీ క్రీడా మైదానంలో బుధవారం నుంచి హాకీ వేసవి శిక్షణ శిబిరాన్ని హాకీ అసోసియేషన్ సెక్రటరీ కొరారు నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు హాకీ స్టిక్స్‌ను అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కృష్ణవేణి అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఏఎంఎల్.రాజు, రాంబాబు, ట్రెజరర్ టి.నరసింగరావు, భవానీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరిక


జనసేనలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసిన గెడ్డం బుజ్జి

పాయకరావుపేట రూరల్, మే1: మండలంలోని పీఎల్.పురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం జనసేనలో చేరారు. ఆ గ్రామ ఎంపీటీసీ మాజీ సభ్యుడు మేడిశెట్టి కృష్ణ, శ్రీరంగం రామకృష్ణ, శ్రీరంగం అభి, మేడిశెట్టి చక్రధర్‌లతో పాటు పలువురు గుంటపల్లిలో నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి సమక్షంలో జనసేనలో చేరారు. వారందరికీ గెడ్డం బుజ్జి కండువాలు వేసి ఆహ్వానించారు.

రాష్ట్రంలో రైతాంగం కుదేలు

▸▸ లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

కొత్తూరు, మే 1 : రాష్ట్ర రాజకీయాల్లో అవగాహన లేని మంత్రులు ఉండడం వల్లే రైతాంగమంతా కుదేలైందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం ఆయన మెట్టపాలెం, జగన్నాథపురం గ్రామాల్లో ఉపాధి కూలీలతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తికాకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మత్తు ఆంధ్రప్రదేశ్‌గా తయారుచేశారని ఆరోపించారు.ఎన్నికల్లో కొణతా రామకృష్ణకు గ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు బండారు రామారావు, సర్వసిద్ధి శ్రీను, మువ్వ ల సూర్యనారాయణ, సర్వసిద్ధి కన్నంనాయుడు పాల్గొన్నారు.

సాగుకు నీరేది.. పంట పండించే దారేది..?

బుచ్చెయ్యపేట, మే 1 :
వడ్డాది కస్పా గ్రోయిన్ పరిధిలోని ఆయకట్టు రైతుల కష్టాలు తీరడం లేదు. టీడీపీ హయంలో నిధులు మంజూరు చేసి గ్రోయిన్ నిర్మాణ పనులు ప్రారంభించినప్పటికీ వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. పోనీ విశాఖ డెయిరీ నిధులతో పనులు ప్రారంభమయ్యాయని సంబరపడిన తరుణంలో మిచౌంగ్ తుఫాన్ కారణంగా అవాంతరం ఎదురైంది. ఆ తరువాత ఈ పనులపై దృష్టిసారించేవారు కరువయ్యారు. ఫలితంగా రానున్న ఖరీఫ్ సీజన్‌లో తమ సాగు భూములకు నీరు అందేది ఎలా.. పంటలు పండేది ఎలా.. అని ఆయా అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

కడతేరని 'వడ్డాది కస్పా' రైతుల కష్టాలు

- నాడు టీడీపీ హయాంలో గ్రోయిన్ నిర్మాణానికి నిధులు మంజూరు
- వైసీపీ అధికారంలోకి వచ్చాక 'రివర్స్' నిర్ణయంతో నిలిచిన పనులు
- విశాఖ డెయిరీ ముందుకు వచ్చినా మిచౌంగ్ తుఫాన్‌తో అవాంతరం
- ఆ తరువాత కన్నెత్తి చూసేవారు కరువు
- నేడు ఆందోళనలో అన్నదాతలు


మిచౌంగ్ తుఫాన్ ధాటికి దెబ్బతిన్న గ్రోయిన్ నిర్మాణ పనులు


మిచౌంగ్ తుఫాన్ ధాటికి దెబ్బతిన్న గ్రోయిన్ నిర్మాణ పనులు

పది సంవత్సరాల క్రితం బుచ్చెయ్యపేట మండలంలోని వడ్డాది కస్పా గ్రోయిన్ దెబ్బతినడంతో వడ్డాది, చినఅప్పన్నపాలెం, పోలేపల్లి, గౌరీపట్నం గ్రామాల్లోని పద్నాలుగు వందల మంది రైతులకు చెందిన 1600 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. నిధుల సమస్య కారణంగా ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు చేతులేత్తేయడంతో సదరు ఆయకట్టుకు నీరందకపోవడంతో రైతులు పంటలు పండక నష్టాల ఊబిలో కూరుకుపోయారు. ఇదిలావుంటే, చోడవరం నియోజకవర్గంలో సాగునీటి సమస్యను 2017లో అప్పటి ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో ఆయన వడ్డాది కస్పా గ్రోయిన్‌కు రూ.1.10 కోట్లు, గౌరీపట్నం గ్రోయిన్‌కు రూ.1.53 కోట్లు, బెన్నవోలు గ్రోయిన్‌కు రూ.1.21 కోట్లు, పీఎస్‌పేట గ్రోయిన్‌కు రూ.1.34 కోట్లు, చాకిపల్లి గ్రోయిన్‌కు రూ.3.21 కోట్లు, కలిగొట్ల గ్రోయిన్‌కు రూ.1.68 కోట్లు, మల్లాం గ్రోయిన్ నిర్మాణానికి రూ.1.71 కోట్లు మొత్తం ఏడు గ్రోయిన్ల అభివృద్ధికి సుమారు 12.29 కోట్ల రూపాయాల నిధులను మంజూరు చేసి, టెండర్లను ఖరారు చేశారు. ఈ ఏడు గ్రోయిన్ల నిర్మాణాలతో 25 గ్రామాలకు చెందిన సుమారు ఏడు వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందేలా ప్రణాళిలు రూపొందించారు. ఇందులో భాగంగా 2018లో వడ్డాది కస్పా గ్రోయిన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో రివర్స్ పేరుతో గ్రోయిన్లను రద్దు చేశారు. అయితే అప్పటికే 35 శాతం పైబడి వడ్డాది కస్పా గ్రోయిన్ పనులు జరగడంతో రద్దు పద్దు నుంచి తప్పించుకోగా, మిగతా ఆరు గ్రోయిన్ పనులు రద్దయ్యాయి. ఇదిలావుంటే, తుఫాన్ కారణంగా సంభవించిన వరదలకు అసంపూర్తి స్థాయిలో నిలిచిన వడ్డాద కస్పా గ్రోయిన్ నిర్మాణ పనులు కొట్టుకుపోయాయి. దీంతో ఆ పరిధిలోని రైతుల ఆయకట్టు కష్టాలు కడతేరలేదు. దీనిపై పలుమార్లు చేసని అభ్యర్థనల మేరకు గత ఏడాది విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో వడ్డాది కస్పా గ్రోయిన్ పునఃనిర్మాణానికి ఛైర్మన్ ఆడారి ఆనందకుమార్ గ్రీన్ సిగ్నిల్ ఇచ్చారు. సుమారు కోటి రూపాయిల నిధులతో నూతన సాంకేతిక విధానంతో వడ్డాది కస్పా గ్రోయిన్ నిర్మాణ పనులు జరగడంతో ఆయకట్టు రైతులు తమ సమస్య తీరిందని ఆశించారు. అయితే 80 శాతం జరిగిన పనులు వర్షాల కారణంగా నిలిచిపోయాయి. గ్రోయిన్‌పై కాంక్రీట్ గ్రౌడింగ్ పనులు, గ్రోయిన్‌కి లాక్ నిర్మాణ తదితర ఇరవై శాతం పనులు మిగిలిపోయాయి. గత ఏడాది డిసెంబరు మొదటి వారంలో ఏర్పడిన మిచౌంగ్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాల తాకిడికి వడ్డాది కస్పా గ్రోయిన్ దెబ్బతింది. వర్షాలు తగ్గిన అనంతరం దెబ్బతిన్న గ్రోయిన్ మరమ్మతు పనులతో పాటు మిగిలిపోయిన పనులను చేపడతామని డెయిరీ ప్రకటించింది. మరో రెండు నెలల్లో ఖరీఫ్ సీజన్ పనులు ప్రారంభం కానున్నా, పనులు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టుకు నీరు అందకపోతే ఈ సీజన్‌లో పంట నష్టాలు తప్పేలా లేవని ఆయా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను రద్దుచేసి వైసీపీ ప్రభుత్వం రైతుల నోట్లో మట్టికొట్టిందని నియోజకవర్గం రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన గ్రోయిన్ల నిర్మాణాలు జరిగితే ఏడు వేల ఎకరాల ఆయకట్టుకు పుష్కలంగా నీరు అందేదని, నిధులు రద్దు చేసి వైసీపీ ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని వాపోతున్నారు.

విస్తుపోయేలా.. రోడ్డు విస్తరణ..!

- ఆరిలోవ అటవీ ప్రాంతంలో తాజా పనులను చూసి పలువురు ఆశ్చర్యం
- తొలుత కల్వర్టులు నిర్మించాల్సి ఉన్నా పట్టని అధికారులు


ఆరిలోవ అటవీ ప్రాంతంలో శిథిలావస్థకు చేరిన కల్వర్టు

గొలుగొండ, మే 1 : ఆరిలోవ అటవీ ప్రాంతంలో తాజాగా జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను చూసి పలువురు విస్తుపోతున్నారు. తొలుత కల్వర్టులు నిర్మించిన అనంతరం ఈ పనులు చేపట్టాల్సిందిపోయి, ఎన్నికల వేళ ఆదరాబాదరాగా చేపడుతుండడాన్ని చూపి ఆశ్చర్యపోతున్నారు. గొలుగొండ మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులను సంబంధిత కాంట్రాక్టర్ ప్రస్తుతం చకచకా సాగిస్తున్నారు. అడవిరాజులబాబు గుడి నుంచి పప్పుశెట్టిపాలెం జంక్షన్ వరకూ చేపడుతున్న ఈ నాలుగు కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనుల్లో నాలుగు కల్వర్టులు ఉన్నాయి. పాతవి శిథిలావస్థకు చేరుకోవడంతో వాటి స్థానంలో నూతనంగా కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఆ దిశగా కాకుండా విస్తరణ పనులు చేపడుతున్నారు. ఇలాగైతే మున్ముందు కొత్త సమస్యలు తప్పవనే వాదన వినిపిస్తోంది. అలాగే, కల్వర్టుల వద్ద తారురోడ్డు వేయకుండా వదిలేస్తున్నారు. టీడీపీ హయాంలో అయ్యన్న మంత్రిగా ఉన్న సమయంలో నర్సీపట్నం నుంచి కృష్ణాదేవిపేట వరకు 24కి.మీ. రోడ్డు విస్తరణకు సంబంధించి 2017లో ప్రపంచ బ్యాంకు నిధులు రూ.24కోట్ల మంజూరు చేయించారు. దీంతో అప్పట్లో ఆరిలోవ అటవీ ప్రాంతంలో నాలుగు కిలోమీటర్లు మినహా మిగిలిన పనులను పూర్తిచేయించారు. కానీ ఈ నాలుగు కి.మీకి సంబంధించి అటవీ శాఖ అనుమతులు మంజూరు ఆలస్యం కావడంతో అప్పట్లో ఎర్రవరం రాజుల బాబు గుడి వద్ద నుంచి పప్పుశెట్టిపాలెం జంక్షన్ వరకూ పనులు నిలిచిపోయాయి. చివరకు అదిగో.. ఇదిగో.. అంటూ ఎమ్మెల్యే గణేశ్ అటవీశాఖ అనుమతులను రెండున్నరేళ్ల క్రితం తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఆ తరువాత పనులు అంతగా ముందుకు సాగలేదు. ప్రస్తుతం ఎన్నికల వేళ ఈ పనులు ఊపందుకున్నాయి. ఇదిలావుంటే, ఈ సమస్యను ఆర్అండ్‌బీ జేఈ ప్రసాద్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా, నాలుగు కల్వర్టులు త్వరగా నిర్మాణం జరిగేలా చర్యలు చేపడతామన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం



పిల్లలకు గుడ్లు అందజేస్తున్న వెలగానారాయణరావు

నర్సీపట్నం, మే 1 : పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ శిక్షణకు హాజరైన విద్యార్థులకు పట్టణ ప్రముఖులు వెలగా నారాయణరావు బుధవారం పౌష్టికాహారాన్ని అందజేశారు. కరాటే, వూషు, బాక్సింగ్, థైక్వాండో, యోగా, వెయిట్ లిఫ్టింగ్, చెస్ వంటి క్రీడలలో శిక్షణ ఇస్తామని కోచ్ శేఖర్ తెలిపారు. ప్రతి రోజూ ఉదయం ఆరు నుంచి తొమ్మిది గం టల వరకు, సాయంత్రం నాలుగు నుంచి ఏడు గంటల వరకు ఈ తరగతలు ఉంటాయన్నారు. ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

వైసీపీ నేతల కబంధ హస్తాల్లో ఉత్తరాంధ్ర భూములు

... 3వ పేజీ తరువాయి

అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. అచ్యుతాపురంలో గురువారం జరిగిన వారాహి యాత్రలో పాల్గొన్న ఆయన స్థానిక ఎమ్మెల్యే కన్నబాబు రాజుపై విరుచుకు పడ్డారు. ఐదేళ్లలో కన్నాల రాజు భూదందాలు, సెజ్ కర్మాగారాల్లో దందాలతో కోట్లు ఆర్జించాడే తప్ప ఒక్క అభివృద్ధి కార్యక్రమమైనా చేశాడా? అని ప్రశ్నించారు. సెజ్ పేరుతో అధికారుల ద్వారా నోటీసులు ఇప్పించడం, రైతులను భయభ్రాంతులకు గురిచేసి వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించి కోట్లు ఆర్జించాడన్నారు. కొండలు, గుట్టలు అనే తేడా లేకుండా ఆక్రమించుకున్నాడన్నారు. అలాగే సింహాచలం దేవస్థానానికి చెందిన భూమిని ఆక్రమించి భారీ భవనాన్ని నిర్మించుకున్నాడన్నారు. కొండలు, గుట్టలు, గాలి, నీరు, నిప్పు ఎవడి సొత్తు కాదు. మనది, మనందరిది.. వీటిని ఆక్రమించుకోవడానికి వారికి ఏమి హక్కుంది? అని ఆయన ఆవేశంగా అన్నారు. అలాంటి వారికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలా?, వద్దా? అని ప్రశ్నించారు. బుద్ధి చెప్పాలి.. చెప్పాలి అని జనం కేకలు వేశారు. నియోజక వర్గంలో ప్రజలకు స్వాతంత్ర్యం లేదు. ఏది అడిగినా పోలీసు కేసులు. అలాగే ఒక విద్యార్థి ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి అడిగితే చెంప మీద కొట్టాడు. అలాంటి వ్యక్తికి మళ్లీ ఓటు వేయాలా?.. అనగానే వద్దు, వద్దు అంటూ జనం సమాధానమిచ్చారు. ఎలమంచిలి అభివృద్ధి చెందాలంటే సుందరపు విజయకుమార్, అనకాపల్లి జిల్లా అభివృద్ధి చెందాలంటే సీఎం రమేశ్‌ను గెలిపించాలన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వస్తే ముందుగా కన్నాల రాజు మీ ఇళ్లను కూడా కబ్జా చేస్తాడని అన్నారు. స్థానిక అధికారులకు చెప్పినా అక్కడ వాళ్ల అధికారులే ఉంటారు కనుక వారు ఏమీ చేయరన్నారు. అప్పుడు హైకోర్టుకు వెళ్లాలన్నారు. ఒక పార్టీ నడుపుతూ, జనాదరణ ఉన్న తానే హైకోర్టుకి వెళ్లలేనని, ఇక సామాన్యులెలా వెళతారని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో జీవన భృతి, పూడిమడకలో హార్బర్ నిర్మాణం చేస్తామని చెప్పారు.

కరప్షన్ కింగ్ అదీప్‌రాజ్

పెందుర్తి: గత ఎన్నికల్లో పెందుర్తి నియోజకవర్గ ఓటర్లు యువకుడైన అదీప్‌రాజ్ మేలు చేస్తాడని గెలిపిస్తే కరప్షన్ కింగ్‌గా మారాడని పవన్ కల్యాణ్ విమర్శించారు. రాష్ట్రస్థాయిలో జగన్ దోచుకుంటే, నియోజకవర్గ స్థాయిలో అతను దోచేస్తున్నాడన్నారు. ఈ ప్రాంతంలో ఫ్లాట్ కొనాలన్నా అదీప్‌రాజ్ మనుషులకు డబ్బులు చెల్లించాల్సి వస్తోందన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని తరలించాల్సిందిగా ప్రజలు కోరుతున్నా జగన్ పట్టించుకోలేదని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ బాధ్యతను తీసుకుంటామని పవన్ కల్యాణ్ స్పష్టంచేశారు. యువతకు ఉద్యోగాలు రావాలంటే పరిశ్రమలు రావాలని, కానీ, ఆ పరిశ్రమల వల్ల ఎవరూ బలి కాకూడదన్నారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఇక్కడి ప్రజల సమస్యలకు పరిష్కారాన్ని చూపించకుండా..కబ్జాలు, సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నాడన్నారు. అదీప్‌రాజ్ ఓటు అడగానికి వస్తే గెట్ లాస్ట్ అదీప్, గెట్ లాస్ట్ జగన్...అని చెప్పాలని పవన్ సూచించారు. పెందుర్తిలో చట్టాలు, రాజ్యాంగం లేదా..? అని ప్రశ్నించిన పవన్..అదీప్‌రాజ్ నువ్వు జస్ట్ ఎమ్మెల్యే మాత్రమేనని గుర్తుంచుకోవాలన్నారు. పంచగ్రామాల సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని, అసెంబ్లీలో ఈ ప్రాంత గళం వినిపిస్తానని పవన్ స్పష్టంచేశారు. చెత్త పన్నును చెత్తలో పడేస్తామని, చెత్తపై పన్ను వేసిన ఈ ప్రభుత్వాన్ని కూడా చెత్తలో పడేద్దామని స్పష్టం చేశారు.

హామీలు అమలు చేసే బాధ్యత మాదీ

మేనిఫెస్టోలోని హామీలను అమలు చేసే బాధ్యత తమదని పవన్ కల్యాణ్ స్పష్టంచేశారు. ఉమ్మడి మేనిఫెస్టోను స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అన్ని వర్గాలకు మేలు చేసేలా రూపొందించామన్నారు. ఎంపీగా సీఎం రమేష్‌ను, ఎమ్మెల్యేగా పంచకర్ల రమేశ్‌బాబును గెలిపించాలని, వీరిద్దరితో పని చేయించే బాధ్యతను తాను తీసుకుంటానన్నారు.

రాండమైజేషన్ ప్రకారం ఈవీఎంలు కేటాయింపు

పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో చేపట్టిన ఆర్‌వో


పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు కేటాయిస్తున్న ఆర్‌వో జయరాం

నర్సీపట్నం, మే 1 : ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో కంప్యూటర్ రాండమైజేషన్ ప్రకారం ఈవీఎం, వీవీ ప్యాడ్‌లు పోలింగ్ కేంద్రాలకు కేటాయింపు ప్రక్రియను బుధవారం నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాం ఆన్‌లైన్‌లో రాండమైజేషన్ ప్రకారం నియోజకవర్గంలోని 262 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు కేటాయించి ఆ వివరాలను అభ్యర్థులకు అందజేశారు. అనంతరం ఎన్నికల వ్యయ పరిశీలకులు సంజయ్‌గాంధీ పోటీలో అభ్యర్థులు, అధికారుల నుంచి ఎన్నికల ఖర్చుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి జయరాం వీవీ ప్యాడ్‌లో బ్యాలెట్ పత్రం అమర్చడంపై ఈవీఎం కమిషనింగ్ బృందానికి అవగాహన కల్పించారు.

'కూటమి అభ్యర్థుల గెలుపుతోనే జిల్లా అభివృద్ధి'


మేడిచర్ల సభలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

కె.కోటపాడు, మే 1 : మేడిచర్లలో బుధవారం రాత్రి మాడుగుల టీడీపీ అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనతో పాటు కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. సీఎం రమేష్ సోదరుడు సురేష్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, పార్టీ నాయకులు పైలా ప్రసాదరావుతో పాటు మూడు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రావికమతంలో...


కూలీలతో మాట్లాడుతున్న రమేష్ బంధువు

రావికమతం : జిల్లా అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి అనకాపల్లి పార్లమెంటు అభ్యర్థి సీఎం రమేష్‌కు అంతా ఓట్లు వేసి గెలిపించాల్సిందిగా సీఎం రమేష్ కుటుంబ సభ్యులు పూజారిత్విక్, జ్యోతి, విజయ అన్నారు. రావికమతం కప్పల బంద చెరువులో పనిచేస్తున్న ఉపాధి కూలీలను బుధవారం వారు కలిసి సమస్యలు తెలుసుకున్నారు.

అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను నేరుగా ప్రధాని నరేంద్రమోదీ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించే నాయకుడు సీఎం రమేష్ అన్నారు. అటు వంటి వారిని ఈ ఎన్నికల్లో ఎన్నుకుంటే అన్ని విధాలా బాగుటుందన్నారు. సీఎం రమేష్‌తో పాటు చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి రాజును గెలిపించాల్సిందిగా కోరారు. టీడీపీ, జనసేన పార్టీ మండల అధ్యక్షులు రాజాన కొండనాయుడు, ఝైచర్ల నాయుడు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గల్లారాజేశ్వరావు, ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, ఎంపీటీసీలు గంజి సూర్యనారాయణ పాల్గొన్నారు.

కొండపాలెం జగనన్న కాలనీలో ఆక్రమణల తొలగింపు

రోలుగుంట, మే 1 : ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రవిచంద్ర హెచ్చరించారు. కొండపాలెం జగ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నన్న కాలనీలో ఆక్రమణలు' శీర్షికతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు బుధవారం వీఆర్‌వో చెల్లయ్యమ్మ, ఇతర రెవెన్యూ సిబ్బందిని సదరు గ్రామానికి పంపించి ఆక్రమణదారులను హెచ్చరించారు. ఆక్రమిత స్థలంలో ఏర్పాటైన షాపులను ఖాళీ చేయించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి కేసుల్లో ఇరుక్కోవద్దని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.


ఆక్రమణ స్థలంలో షాపు తొలగిస్తున్న దృశ్యం

వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరిక


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో కేఎస్ఎన్ఎస్ రాజు

రావికమతం, మే 1 : మేజర్ పంచాయతీ కొత్తకోటలో పలువురు వైసీపీని వీడి బుధవారం టీడీపీలో చేరారు. వీరికి కూటమి చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టనున్న పథకాలను వివరించారు. మాజీ ఎంపీపీ దంగేటి రామకృష్ణ, టీడీపీ నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కోట నీవేణి, నాయకులు రాజాన కొండనాయుడు, కోట గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

'వృద్ధులు, కదలలేని వారికి ఇంటి వద్దే పింఛన్'


దివ్యాంగుడికి పింఛన్ నగదు అందిస్తున్న ఎంపీడీవో

చీడికాడ, మే 1 : దివ్యాంగులు, వృద్ధులు, కదలలేని స్థితిలో ఉన్నవారికి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందించాలని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా తురువోలుతో పాటు చెట్టుపల్లి, అర్జునగిరి గ్రామాల్లో పింఛన్ల పంపిణీ ప్రక్రియను బుధవారం ఆమె పరిశీలించారు. పింఛన్ల పంపిణీలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఇతరులతో పంపిణీ చేసినట్టు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకుడు ఎం.కామేశ్వరరావు, తురువోలు వీఆర్‌వో వై.సోమునాయుడు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.


రావికమతంలో నిర్మానుషంగా ఉన్న రహదారి

కొనసాగుతున్న ఎండల తీవ్రత

మాడుగుల/ రావికమతం/ చీడికాడ, మే 1 : రోజు రోజుకు ఎండలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. దీంతో జనం ఇంట్లో ఉన్నా, వీధిలోకి వెళ్లినా ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీనికితోడు వడగాల్పులు మరింతగా భయపెడుతున్నాయి. ఉదయం పది గంటల నుంచి సాయంత్ర నాలుగు గంటల వరకు వడగాల్పులు ఆగడం లేదు. దీంతో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం మాడుగుల, రావికమతం, చీడికాడ తదితర మండలాల్లో చాలా రోడ్లు మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా కనిపించాయి.


చీడికాడలో..

వింటిపాలెంలో టీ దుకాణం దగ్ధం

చీడికాడ, మే 1 : తునివలస శివారు వింటిపాలెంలో ఓ చిరు వ్యాపారికి చెందిన టీదుకాణం దగ్ధమైంది. దీంతో సుమారు రూ.రెండు లక్షల వరకూ ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా. బుధవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో చెట్లంకి సూర్యనారాయణ ఇంటి ముందు ఉన్న టిఫిన్ షాపులో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కిరాణా సామగ్రి, సిల్వర్ సామగ్రి, టేబుళ్లు, కుర్చీలు తదితరాలు అన్నీ కాలి బూడిదయ్యాయి. బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. నిరుపేద కుటుంబానికి చెందిన తనను ఆదుకోవాల్సిందిగా బాధితుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జన ప్రభంజనం

... 3వ పేజీ తరువాయి

ఎదురు చూశారు. సరిగ్గా 4.35 గంటలకు పవన్ వారాహి రథం మీదకు వచ్చారు. ముందుగా నవ్వుతూ అందరికీ అభివాదం చేశారు. పవన్ కల్యాణ్ తన ప్రసంగం పారంభించే ముందు కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం 5.20 గంటలకు పవన్ ప్రసంగం ముగిసింది. సభ అనంతరం వచ్చిన జనం తిరిగి వెళ్లడానికి చాలా సమయం పట్టింది. అచ్యుతాపురం నాలుగురోడ్ల కూడలి జనాలతో నిండిపోయింది. పోలీసులు ముందుగానే అచ్యుతాపురం జంక్షన్‌లో పూడిమడక రోడ్డు వైపు బారికేడ్లతో రాకపోకలను నిషేధించారు. సమావేశం తరువాత నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి ఎటు చూసినా రెండుకిలోమీటర్ల మేర జనంతో నిండిపోయింది. సాయంత్రం ఆరు వరకు ట్రాఫిక్ క్లియర్ కాలేదు. సమావేశానికి సుమారు 20 వేల మంది వచ్చి ఉంటారని అంచనా.

పెందుర్తిలో...

పెందుర్తి: పెందుర్తి జనసంద్రాన్ని తలపించింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి విజయభేరి యాత్ర ప్రభంజనం సృష్టించింది. బుధవారం సాయంత్రం అచ్యుతాపురంలో సభ ముగించుకుని పవన్ కల్యాణ్ హెలికాప్టర్‌లో సరిపల్లిలోని హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా ప్రజలకు అభివాదం చేస్తూ పెందుర్తి జంక్షన్‌లోని సభాస్థలికి చేరుకున్నారు. జన సైనికులతో పాటు టీడీపీ, బీజేపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు వెల్లువలా తరలిరావడంతో పెందుర్తి కిక్కిరిసిపోయింది. పవన్ ప్రసంగిస్తున్నంత సేపు అభిమానులు కేరింతలు, నృత్యాలతో హోరెత్తించారు. మహిళలు, కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలుపుతూ పవన్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తూటాల్లాంటి మాటలతో వైసీపీ అధినేత జగన్‌పై ధ్వజమెత్తారు. శ్రీశ్రీ, శేషాద్రి కవితలతో ఓటర్లను చైతన్యపరుస్తూ, వైసీపీ అరాచకాలను ఎండగడుతూ ప్రసంగించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో రాష్ట్రంలో సునామీ రాబోతుందన్నారు.

పగిలే కొద్దీ గాజు పదునెక్కుతుంది

గాజు పగిలే కొద్దీ పదునెక్కుతుందని..ప్రజల్ని పీడిస్తున్న జలగ జగన్‌ను గద్దె దించేందుకు తాను తగ్గి కూటమి కట్టానన్నారు. ప్రజలు భయం గుప్పిట్లో బతుకున్నారన్నారు. ప్రజాధనాన్ని రాబందుల్లా దోచేస్తున్న జగన్ రెడ్డి, పెద్దిరెడ్డి, సుబ్బారెడ్డి ఆగడాలకు అంతం పలకాలని యువతకు పిలుపునిచ్చారు.



వాడవాడలా ఘనంగా మే డే వేడుకలు


చోడవరంలోని ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద మే డే వేడుకల్లో విద్యుత్ ఉద్యోగులు

చోడవరం, మే1 : మేడే వేడుకలను బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో భారీగా పాల్గొన్న కార్మికులు ఎర్రజెండాలతో చోడవరం పట్టణంలో ర్యాలీలు నిర్వహించడంతో పాటు, పతాకాలను ఆవిష్కరించారు. పట్టణంలో ఐఎఫ్‌టీయూ రైతు కూలీ సంఘం, భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కొత్తూరు జంక్షన్‌లో మానవహారం నిర్వహించి అనంతరం ర్యాలీ జరిపారు. నాయకులు అయితిరెడ్డి అప్పలనాయుడు, కిల్లి దేముడు, రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు, స్త్రీవిముక్తి సంఘటన్ జిల్లా కన్వీనర్ ఓపీఎస్ లక్ష్మీకుమారి, నవయువ సమాఖ్య జిల్లా నాయకులు నందారపు భాస్కరరావు, భవన నిర్మాణరంగ కార్మిక సంఘాల నాయకులు పల్లా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, సీపీఐ, ఏఐటీయూసీ, సీపీఎం ఆధ్వర్యంలో, ఏరియా సమితి నాయకుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో కార్మికులు పాతబస్టాండ్, మోటారు వర్కర్స్ కార్యాలయం వద్ద ఎర్రజెండా ఎగరేశారు. అదేవిధంగా స్థానిక ఈపీడీసీఎల్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద బుధవారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ డీఈ వీడీవీ రామకృష్ణారావు, విద్యుత్ కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వేపాడ సత్యనారాయణ, కేవీ రవికుమార్, మర్రా సత్తిబాబు, ప్రేమ చంద్రశేఖర్, కె.నాగప్పారావు, జీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ/ కృష్ణాదేవిపేట : ఎన్నో పోరాటాలు.. ఎందరో ప్రాణత్యాగాల ఫలితంగానే నేడు కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని విశాఖ ఉమ్మడి జిల్లా జీసీసీ కలాసీల సంఘం కార్యదర్శి లగుడు సీతయ్యనాయుడు అన్నారు. మే డే సందర్భంగా ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, చోద్యం తదితర గ్రామాల్లో బుధవారం జెండాను ఎగురవేసి మాట్లాడారు. జీసీసీ కళాసీల సంఘం నాయకుడు సీతయ్యనాయుడు, తానారి రాజు, సత్తిబాబు, సన్యాసి, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు. అలాగే జోగంపేట, గొలుగొండ, కొత్తఎల్లవరం, పాకలపాడు, ఏటిగైరంపేట గ్రామాల్లో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బుంగా గంగరాజు, బట్టా గంగాధర్, తదితరులు జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నర్సీపట్నం అర్బన్ : మే డేను మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. గబ్బాడలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు తదితరుల ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. సమిధ సంస్థ ఆధ్వర్యంలో నర్సీపట్టణంలోని పీఆర్ ఎడ్యుకేటర్లను సన్మానించారు. ఏఎస్ఐ కామేశ్వరరావు, సంస్థ కౌన్సిలర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : మండలంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. బంగారుమెట్ట, వడ్డాది, దిబ్బిడి, బుచ్చెయ్యపేట తదితర గ్రామాల్లో సీఐటీయూ జెండాలు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) నాయకులు పినపాత్రుని సాంబశివరావు, పి.చంద్రశేఖర్, నాయుడు, శ్రీను, కళాసీలు, ఆటో డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రావికమతం : మే డే ఉత్సవాలను కొత్తకోట, చీమలపాడు, గర్నికం గ్రామాల్లో సీఐటీయూ, గిరిజన సంఘం, అంగన్‌వాడీ, ఆశ, ఆటో, ముఠా కార్మికులు, ఎలక్ట్రికల్ యూనియన్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, అంగన్‌వాడీ ప్రాజెక్టు లీడర్ ఎస్.సత్యవేణి, బి.బుల్లిబాబు, తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : ఎం.అలమండలో మే డేను గౌరీ శంకర భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు హాజరై జెండాను ఎగురవేశారు. సర్పంచ్ దాడి జగన్, పోతల వెంకటరావు, బండారు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద, నాలుగు రోడ్లలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జెండాను ఎగుర వేశారు. డి.వెంకన్న, ప్రసాద్, దేముళ్లు, సృజన, అప్పారావు పాల్గొన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. సిం హాద్రి, రాజు తదితరులు పాల్గొన్నారు.